





అలయ ధ్వజస్తంభానికి నమస్కరిస్తున్న సీఎం చంద్రబాబు

శ్రీవారి చిత్తంతోనే అమరావతి

- వెంకన్న ఆలయానికి రాజధానిని కాపాడే శక్తి
- రూ.260 కోట్లతో శ్రీనివాసుడి ఆలయం అభివృద్ధి
- ఆలయ విస్తరణకు శంకుస్థాపనలో సీఎం చంద్రబాబు
- వెంకటపాలెంలో వైభవంగా భూమిపూజ, అద్వేష్టక శిలేష్టకాన్యాసం



శంకుస్థాపన క్రతువులో పాల్గొన్న సీఎం చంద్రబాబు

గుంటూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): 'దేవతల రాజధాని అమరావతి.. మన రాజధాని కూడా అమరావతి. దేవతల రాజధాని ఎలా ఉంటుందో.. ఆ నమూనాగా అమరావతి ఉండాలి. ఆయన ఆశీస్సులతోనే అమరావతి నిర్మాణం ముందుకు సాగుతుంది. ఆయన చిత్తంతోనే రాజధాని రైతులు కూడా అమరావతి కోసం భూములిచ్చారు. అమరావతి విషయంలో ఎవరికీ ఎలాంటి అనుమానం అవసరం లేదు. ఆ దేవదేవుడే అమరావతిని రక్షిస్తాడు. వేంకటేశ్వరస్వామి సంకల్పంతోనే రాజధానికి అమరావతి అనే పేరు పెట్టాను..' అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెంకటేశ్వర స్వామిని కోరుకున్నారు. గురువారం ఉదయం రాజధాని పరిధిలోని వెంకటపాలెంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో రూ.260 కోట్లతో అభివృద్ధి పనులకు టీటీడీ సంకల్పించింది. ఈ సందర్భంగా శ్రీవెంకటేశ్వరస్వామివారి ద్వితీయ చతుర్ద్వార మహా ప్రాకార నిర్మాణం, మాడవీధులు, అన్నదాన కాంప్లెక్స్‌ల నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేశారు. భూమిపూజ, అద్వేష్టక శిలేష్టకాన్యాసం అత్యంత వైభవోపేతంగా జరిగింది. అర్చకుల వేద మంత్రాలు, మంగళవాయిద్యాలు, భక్తుల గోవింద నామస్మరణల నడుమ ముఖ్యమంత్రి పునాదిరాయి వేశారు. అర్చకులు చతుర్వేద పారాయణం, నివేదనం, దివ్య సమర్పణ, హోమం, పూర్ణాహుతి, వేదాశీర్వచనం నిర్వహించారు. ఆలయానికి సంబంధించి మాస్టర్ ప్లాన్ పరిశీలించిన ముఖ్యమంత్రి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు ముఖ్యమంత్రికి శ్రీవారి లడ్డూ ప్రసాదాలు అందజేశారు. వేద పండితులు వేద ఆశీర్వచనం అందించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ 2019లోనే ఆలయాన్ని నిర్మించేందుకు సంకల్పించామని, ఇప్పుడు దానిని పూర్తి స్థాయిలో అభివృద్ధి (మిగతా 6వ పేజీలో)



టీటీడీ బోర్డు సభ్యులతో సీఎం చంద్రబాబు

సివిల్ సప్లయిస్ డీఎంగా శ్రీలక్ష్మి



జేసీ భావనను కలిసిన డీఎం శ్రీలక్ష్మి

(బాపట్ల, ఆంధ్రజ్యోతి) సివిల్ సప్లయిస్ డీఎంగా వి.శ్రీలక్ష్మి గురువారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ధాన్యం సేకరణ ప్రక్రియకు సంబంధించి క్షేత్రస్థాయిలో కొంత గందరగోళం నెలకొన్న తరుణంలో డీఎంగా శ్రీలక్ష్మిని నియమిస్తూ బుధవారం ఆదేశాలు ఇచ్చిన సంగతి తెలిసిందే. 24 గంటల వ్యవధిలోనే ఆమె విధుల్లో చేరారు. జాయింట్ కలెక్టర్ భావనను మర్యాదపూర్వకంగా కలిసిన డీఎం శ్రీలక్ష్మి, కొనుగోళ్ల ప్రక్రియ పరోగతిని వివరించారు. బీజీలతో పాటు ఈ క్రాప్ వంటి సాంకేతిక అంశాలను త్వరితగతిన పరిష్కరించి అన్నదాతలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని డీఎంకు జేసీ సూచించారు.

నేటి నుంచి క్షిపణి ప్రయోగాలు

- వచ్చే నెల 6 వరకు సూర్యలంక తీరంలో ఆంక్షలు
- మత్స్యకారులు వేటకు వెళ్లరాదని పోలీసులు ఆదేశాలు

బాపట్ల రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సూర్యలంక సముద్రతీరంలో శుక్రవారం నుంచి వచ్చే నెల 6వ తేది వరకు క్షిపణి ప్రయోగాలు జరుగుతాయని డీఎస్పీ రామాంజనేయులు తెలిపారు. బాపట్ల రూరల్ పోలీసుస్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ నుంచి క్షిపణి ప్రయోగాలకు సంబంధించి మాక్‌డ్రిల్ జరుగుతుందన్నారు. మిస్సైల్ ఆపరేషన్ జరుగుతున్నందున పాండురంగాపురం బీచ్ నుంచి సూర్యలంక ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ వరకు మత్స్యకారులు వేటకు వెళ్లరాదన్నారు. సూర్యలంక తీరానికి వచ్చే పర్యాటకులు కూడా వీలైనంత త్వరగా ఆయా తేదీల్లో స్నానాలు ఆచరించి తిరిగి వెళ్లాలన్నారు. కార్యక్రమంలో రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐ శ్రీనివాసరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. భద్రత దృష్ట్యా తీరంలో వేటపై ఆంక్షలు విధించినందున మత్స్యకారులు సహకరించాలని మెరైన్ సీఐ లక్ష్మారెడ్డి సూచించారు.



మాట్లాడుతున్న డీఎస్పీ రామాంజనేయులు



పుడమి తల్లి రుణం తీర్చుకోవాలి

- సభలో మాట్లాడుతున్న మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, వేదికపై సామాజిక వేత్త దుర్గా కామేశ్వరరావు మండలి బుద్ధప్రసాద్, ఆలపాటి తదితరులు

- డాక్టర్ పీడీకేరావు సేవలు నిరుపమానం
- సేవ తృప్తినిస్తుంది.. మనపై అభిమానం పెంచుతుంది
- భారతజ్యోతి పురస్కార సభలో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు

తెనాలి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): 'నేటి యువత అమెరికా, జర్మనీ అంటూ విదేశాల బాటపడుతున్నారు. మాతృమూర్తిని, పుట్టిన గడ్డను వదిలిపెట్టి సంపాదన కోసం జీవిత సత్యాన్ని మరిచి పరుగులు పెడుతున్నారు. అటువంటి వారికి శ్రీకాకుళం జిల్లాకు చెందిన డాక్టర్ పెమ్మరాజు దుర్గా కామేశ్వరరావు(పి.డి.కె.రావు) వంటి వారి జీవితం ఆదర్శంగా నిలుస్తుంది.' అని మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు అన్నారు. అమెరికాలో డాలర్లు కురిపించే ఉద్యోగాన్ని వదలి, పుట్టిన గడ్డపై సేవ చేయాలనే నిర్ణయంతో ఆనాడే తిరిగివచ్చి.. వెనుకబడిన గ్రామాల ప్రజల ఉన్నతికి పాటుపడటం నిజంగా నేటి రోజుల్లో ఆదర్శమే అవుతుందన్నారు. సేవ తృప్తినిస్తుందన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని ఆయన సూచించారు. గురువారం తెనాలిలోని రామకృష్ణ కవి కళాక్షేత్రంలో తెనాలి ప్రచురణలు, రోటరీ క్లబ్ ఆఫ్ వైకుంఠపురం సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన భారత జ్యోతి పురస్కార ప్రధాన సభకు వెంకయ్య నాయుడు ముఖ్య అతిథిగా విచ్చేశారు. సభకు ముందే భారత జ్యోతి పురస్కారాన్ని కామేశ్వరరావుకు వెంకయ్యనాయుడు చేతుల మీదగా ప్రదానం చేశారు. పీడీకే రావు పరిచయ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భం గా సభలో మాజీ ఉప రాష్ట్రపతి మాట్లా డుతూ.. సమాజంలో మార్పు కేవలం ప్రభుత్వాల వల్ల కాదని, ప్రజల్లో మార్పు, సేవా భావం పెరగాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. కేవలం నాలుగు గోడలకే చదువు పరిమితం కాకుండా వ్యవసాయ క్షేత్రాల వంటివాటికి కూడా అలవాటు చేయాలని కోరారు. ఈ నేలపై ఉన్నందుకు పుడమి తల్లి రుణం కూడా తీర్చుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉండాల్సిన (మిగతా 6వ పేజీలో)

ధాన్యం సేకరణను వేగవంతం చేయాలి

- 30, వచ్చే నెల 1న జిల్లాకు వర్ష సూచనలు
- అధికారులతో కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్

బాపట్ల, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ధాన్యం సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ధాన్యం సేకరణపై సంబంధితశాఖల అధికారులతో గురువారం స్థానిక కలెక్టరేట్ నుంచి ఆయన వీక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో నియోజకవర్గ, మండల ప్రత్యేకాధికారులు వారికి కేటాయించిన మండలాలకు వెళ్లి ధాన్యం సేకరణను పరిశీలించాలన్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలన చేసి ఎదురవుతున్న సమస్యలను గుర్తించి తక్షణమే కలెక్టరేట్‌కు సమాచారం పంపాలన్నారు. ఈ నెల 30, డిసెంబరు 1వ తేదిన జిల్లాలో వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరించిందన్నారు. ఈ నేపథ్యంలో రైతులకు అవసరమైనన్ని టార్పాలిన్ పట్టాలు కొనుగోలు చేశామన్నారు. వర్షం రాకముందే ధాన్యం ఆరబెట్టుకునేలా అవగాహన కల్పించాలన్నారు. తేమ 17 శాతానికి రాగానే ఆర్‌ఎస్‌కేల్లో ధాన్యాన్ని అమ్ముకోవాలన్నారు. రైతు సేవాకేంద్రాలకు గోనె సంచులు సమృద్ధిగా కేటాయించామన్నారు. రైతులు ఎవరు కాల్ చేసిన అధికారులు తక్షణమే స్పందించాలని ఆదేశించారు. జీపీఎస్ నమోదు చేసుకున్న వాహనాలను మాత్రమే అందుబాటులో ఉంచాలన్నారు. ఇప్పటికే జిల్లాలో 505 వాహనాలను ఆర్‌ఎస్‌కేలతో అనుసంధానించామన్నారు. సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ భావన విశిష్ఠ, డీఆర్‌వో జి.గంగాధర్‌గౌడ్, జిల్లా పౌరసరఫరాలశాఖాధికారి జమీర్‌బాషా, జిల్లా మేనేజర్ శ్రీలక్ష్మి, ఆర్డీవోలు పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

అద్దంకి రెవెన్యూ.. నోటిఫికేషన్

అభ్యంతరాలు, సలహాలకు 30 రోజుల గడువు

అద్దంకి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అద్దంకి రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు ప్రభుత్వం గురువారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో అద్దంకి కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని ప్రభుత్వ స్పెషల్ సెక్రటరి బాపట్ల, ప్రకాశం జిల్లాల కలెక్టర్లకు ఉత్తర్వులు ఇచ్చారు. చీరాల డివిజన్‌లోని అద్దంకి నియోజకవర్గంలోని 5 మండలాలతో పాటు దర్శి నియోజవకర్గ పరిధి లో ప్రస్తుతం ఒంగోలు డివిజన్‌లో ఉన్న ముం డ్లమూరు, తాళ్లూరు మండలాలు, కనిగిరి డివి జన్ పరిధిలో ఉన్న దర్శి, దొనకొండ, కురిచేడు మండలాలతో అద్దంకి కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు నోటిఫికేషన్ విడుదల చేశారు. 30 రోజుల్లో కొత్త రెవెన్యూ డివిజన్ ఏర్పాటుపై అభ్యంతరాలు, సలహాలను కలెక్టర్లకు అందజేయాలని నోటిఫికేషన్‌లో తెలిపారు.

నానో యూరియా

- తమకొద్దంటున్న రైతులు
- ప్రతి మూడు బస్తాలకు లీటర్ కొనాల్సిందే
- సొసైటీలు, డీసీ ఎంఎస్‌లో ఒత్తిడి

(కొల్లూరు, ఆంధ్రజ్యోతి): ఏ వస్తువు అయి నా.. కొనుగోలు విషయంలో కొనుగోలుదారులకు పూర్తి స్వేచ్ఛ ఉంటుంది. ఎరువుల కొనుగోలు విష యంలో మాత్రం రైతులకు ఆ స్వేచ్ఛ ఉండటం లేదు. రైతుకు



ఇష్టం ఉన్నా.. లేకపోయినా నానో యూ రియా కొనాల్సిందే నని పట్టుపడుతున్నారు. మొన్నటి వరకు.. ప్రైవేట్ డీలర్లు ఈ విధంగా పట్టుబట్టి మరీ.. ఇష్టం లేని ఎరువులను అంటగట్టే వారు. ఇప్పుడు ప్రభుత్వ రంగ సంస్థలు కూడా అదే వ్యాపారం మొ దలు పెట్టడం వివాదాస్పదమవుతోంది. కేంద్రం రాయితీపై యూరియా బస్తా రూ.266.50కు రైతులకు అందజేస్తోంది.గతంలో ప్రైవేట్ డీలర్లు బస్తా రూ.290 నుంచి రూ.350 వరకు వసూలు చేస్తున్నా రన్న ఆరో పణలతో.. ప్రభుత్వం (మిగతా 6వ పేజీలో)

రైతులకు ఇచ్చిన హామీ అమలు

- ఈనాం రైతులకు అన్నదాత సుఖీభవ లబ్ధి
- రైతన్నా మీ కోసంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్



సీఎం సహాయ నిధి చెక్కులను అందజేస్తున్న మంత్రి రవికుమార్

బల్లికురవ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నట్లు మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. మండలంలోని చెన్నుపల్లి గ్రామంలో గురువారం జరిగిన రైతన్నా మీకోసం కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. అన్ని గ్రామాల్లో అన్నదాత సుఖీభవ పథకం రైతులకు అందిందా లేదా అనేది సర్వే చేయాలని అధికారులను ఆదేశించారు. బల్లికురవ, సంతమాగులూరు మండలాల్లో ఈనాం భూములు సాగు చేస్తున్న 1750 మంది రైతులకు ప్రభుత్వం రెండు విడతల రూ.10 వేలు జమ చేశామన్నారు. కౌలు రైతులకు రూ.20 వేలు అందిస్తుందన్నారు. గ్రామాల్లో లోవోల్టేజి సమస్య లేకుండా చేసేందుకు ఆర్డీఎస్ఎస్ ద్వారా రూ.కోట్లతో 8 పనులు పూర్తి చేయించామన్నారు. 12 వందల మంది రైతులకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేశామన్నారు. మేనాటికి అన్ని గ్రామాల్లో నూరు శాతం ప్రత్యేక విద్యుత్ లైన్ల పనులు పూర్తి అవుతాయన్నారు. నియెజకవర్గంలో 7 విద్యుత్ సబ్‌స్టేషన్లను మంజూరు చేశామన్నారు. గ్రామాల్లో ఆరోగ్య కేంద్రాలకు రూ.4 కోట్లు మంజూరు చేశామని, స్థలాలను వెంటనే గుర్తించాలని అధికారులకు మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ దేవినేని నరేంద్ర, సొసైటీ అధ్యక్షుడు గొట్టిపాటి లక్ష్మయ్య, పార్టీ మండల అధ్యక్షుడు ధూళిపాళ్ల హనుమంతురావు, నేతలు మలినేని గోవిందరావు, గొట్టిపాటి శంకర్, ఆళ్ల చంద్రమౌళి, యాగంటి సింగరయ్య, కొండేటి ఇజ్రాయల్, ఏడీఏ సుదర్శనరాజు, తహసీల్దారు రవినాయక్, ఎంపీడీవో కుసుమకుమారి, డీఈ లు శ్రీనివాసులు, మస్తాన్‌రావు పాల్గొన్నారు.

నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ వరం

నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి వరం అని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. బల్లికురవ, సంతమాగులూరు మండలాలకు చెందిన 30 మందికి రూ.26 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను చెన్నుపల్లి గ్రామంలో మంత్రి అందజేశారు. ఏడా దిన్నరలో నియోజకవర్గంలో 1922 మందికి సీఎం ఆర్ఎఫ్ రూ.18 కోట్లను మంజూరు చేశామన్నారు.

వైసీపీ తప్పులను సరి చేస్తూ జిల్లా ఏర్పాటు

గత వైసీపీ ప్రభుత్వం ఇష్టానుసారంగా జిల్లాను విభజించి ప్రజలను ఇబ్బందికి గురి చేయగా తాము దానిని సరిచేస్తున్నట్లు మంత్రి తెలిపారు. పాదయాత్రలో లోకేశ్ హామీ ఇచ్చినట్లుగా గత ప్రభుత్వంలో జరిగిన జిల్లాల ఏర్పాటులో జరిగిన తప్పులను తాము సరిచేశామన్నారు. అద్దంకి నియెజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలో విలీనంతో పాటు అద్దంకిని రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్‌కు గొట్టిపాటి కృతజ్ఞతలు తెలిపారు.

సివిల్ సర్వీసెస్ ఉచిత శిక్షణ

దరఖాస్తు గడువు పొడిగింపు

గుంటూరు (విద్య) నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సివిల్ సర్వీసెస్ పరీక్షకు ఉచిత శిక్షణ దరఖాస్తు గడువు డిసెంబరు 3వ తేదీకి పొడిగించినట్లు బీసీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ మయూరి గురువారం పర్యటనలో తెలిపారు. బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో అభ్యర్థులకు విజయవాడలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఈ శిక్షణకు ఎంపిక చేసేందుకు డిసెంబర్ 7న ప్రాథమిక పరీక్ష నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. దరఖాస్తులు బీసీ స్టడీ సర్కిల్, రాజా గారి తోట, గుంటూరు చిరునామాకు అందజేయాలని సూచించారు. ఇతర వివరాలకు 0863 -2358071లో సంప్రదించాలని సూచించారు.

ఆప్తమాలజీలో టాపర్‌గా డాక్టర్ హర్షితా రెడ్డి



హర్షితారెడ్డిని అభినందిస్తున్న సుందరాచారి, రవిబాబు

గుంటూరు మెడికల్, నవంబరు 27 (ఆంధ్ర జ్యోతి): డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాల యం విడుదల చేసిన ఆప్తమాలజీ (నేత్ర వైద్య విభాగం) పోస్టు గ్రాడ్యుయేషన్ వార్షిక పరీక్షల్లో గుంటూరు వైద్య కళాశాల విద్యార్థిని డాక్టర్ డి.హర్షితా రెడ్డి టాపర్‌గా నిలిచారు. మొత్తం 800 మార్కులకు గాను ఆమె 585 మార్కులు సాధించారు. ఎన్నారై వైద్య కళాశాలలో ఆమె ఎంబీబీఎస్ చేశారు. అనంతరం జీఎంసీలో ఆప్తమాలజీ పీజీ సీటు పొందారు. జీజీహెచ్ నేత్ర వైద్య విభాగం వైద్యులు అందించిన ప్రోత్సాహంతోనే తాను పీజీలో టాపర్‌గా నిలిచినట్లు ఆమె తెలిపారు. గురువారం వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వీ సుందరాచారీ, నేత్ర వైద్య విభాగాధిపతి డాక్టర్ రవిబాబు తదితరులు డాక్టర్ హర్షితా రెడ్డిని అభినందించారు.

33,916 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 35,654 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 33,916 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 12,710 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	11000	13700
334	10000	17500	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	11000	15300	334	11000	17400
273	---	----	నెంబరు. 5	10500	15800
341	10500	17300	273	--	---
4884	----	---	341	12000	17400
సూపర్ 10	---	----	4884	12000	14000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	15600	తేజ	10500	15300
షార్క్-1	---	----	బ్యాడిగి	11000	17700
బ్యాడిగి	10500	17600	దేవనూరు డీలక్స్	10500	16500
దేవనూరు డీలక్స్	11000	17000	తాలుకాయలు	5000	8200

అమరావతి అభివృద్ధికి రైతుల మద్దతు కావాలి

- రెండో దశ ల్యాండ్ పూలింగ్‌కు సహకరించండి
- అప్పుడే హైదరాబాద్ తరహాలో అభివృద్ధి: రాజధాని రైతులతో సీఎం చంద్రబాబు
- 22 రకాల సమస్యలు వివరించాం.. సీఎం సానుకూల స్పందన
- అమరావతి రాజధాని ఐక్యకార్యాచరణ సమితి కన్వీనర్ పువ్వాడ సుధాకర్

అమరావతి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లా అమరావతి అభివృద్ధి చెందాలంటే 29 గ్రామాల పరిధి సరిపోదని సీఎం చంద్రబాబు చెప్పారు. రాజధాని రైతులతో ఆయన పలు విషయాలు ప్రస్తావించారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఆయన ఏమన్నారంటే.. "రాజధానిగా 1953లోనే విజయవాడ కావాల్సి ఉంది. అప్పుడు కమ్యూనిస్టుల ప్రాబల్యం వల్ల నాటి ప్రభుత్వం కర్నూలును రాజధానిగా చేసింది. ఆ తర్వాత తెలుగు మాట్లాడే ప్రాంతాలన్నీ ఒకే రాష్ట్రంగా ఉండాలని హైదరాబాద్ కేంద్రంగా ఆంధ్రప్రదేశ్ ఏర్పడింది. విభజన సమయంలో రాజధాని ప్రాంతం విషయంలో పలు ప్రతిపాదనలు వచ్చినా.. గతంలో ఈ ప్రాంతానికి జరిగిన అన్యాయాన్ని దృష్టిలో పెట్టుకుని అమరావతిని రాజధానిగా నిర్ణయించాం. అమరావతి పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందాలంటే నేను తీసుకునే నిర్ణయాలకు రైతుల మద్దతు కూడా కావాలి. కార్పొరేషన్ స్థాయిలో అమరావతి అభివృద్ధి చెందాలంటే రెండో దశ ల్యాండ్ పూలింగ్‌కు వెళ్లాల్సిందే. అప్పుడు అంతర్జాతీయ ఎయిర్‌పోర్టులు, స్పోర్ట్స్ సిటీ, వివిధ పరిశ్రమలు వస్తాయి. మిమ్మల్ని అడిగే రెండవ దశ ల్యాండ్ పూలింగ్‌కి వెళుతున్నాం. ఇక్కడకు వచ్చే కంపెనీలకు భూములు ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఇక్కడే మన వారికి ఉద్యోగాలు వస్తాయి. భూములు విరివిగా ఉండడంతో హైదరాబాద్ అన్ని వైపులా నుంచి అభివృద్ధి చెందింది. అమరావతి కూడా అదే విధంగా అభివృద్ధి చెందుతుంది. రైతులెవరూ రిటర్నబుల్ ప్లాట్లు అమ్ముకోవద్దు. మీలో సఖ్యత లేకపోతే అమరావతి కుక్కలు చింపిన విస్తరి అవుతుంది. ప్రభుత్వానికి సహకరించండి. రాజధానికి భూమిలిచ్చిన రైతులుగా మీపై అభిమానం కృతజ్ఞత ఉన్నాయి" అని సీఎం చెప్పారు.

పారదర్శకంగా రాజధాని నిర్ణయాలు

అమరావతిలో ప్రతి సమస్యను తీర్చడానికి కూటమి ప్రభుత్వం ముందుంటుందని సీఎం చంద్రబాబు చెప్పారని.. అమరావతి రాజధాని ఐక్యకార్యాచరణ సమితి కన్వీనర్ పువ్వాడ సుధాకర్ తెలిపారు. గురువారం అమరావతి సచివాలయంలో సీఎంతో భేటీ అనంతరం రాజధాని రైతులు పలువురితో కలిసి పువ్వాడ సుధాకర్ మీడియాతో మాట్లాడారు. అమరావతి రాజధానిపై తీసుకునే ప్రతి నిర్ణయం పారదర్శకంగా ఉంటుందని సీఎం చెప్పారన్నారు. సుమారు గంటన్నర సమావేశంలో తమలోని అపోహలు, భయాందోళనలను సీఎం తొలగించే ప్రయత్నం చేశారన్నారు. అధికారుల ద్వారా ఎవరికైనా అన్యాయం జరిగితే తమ దృష్టికి తీసుకురావాలని, దాన్ని సత్వరమే పరిచేస్తానని, కావాలని అమరావతి రాజధాని మహాయజ్ఞానికి ఎవరైనా భంగం కలిగిస్తే.. చూస్తూ ఊరుకోమని సీఎం స్పష్టం చేశారని చెప్పారు. కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి నారాయణ, ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్‌తో కూడిన కమిటీ ప్రతి నెలా రాజధాని రైతుల సమస్యలపై సమావేశం నిర్వహిస్తుందన్నారు. ప్రతి మూడు నెలలకోసారి అమరావతి రైతులు, రైతు ప్రతినిధులతో మాట్లాడతానని సీఎం చెప్పారని పేర్కొన్నారు. త్రిసభ్య కమిటీ ప్రతి నెలా సమావేశం అవుతుందన్నారు. గ్రామ కంఠాల పరిశీలన కోసం కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీ వేసి.. సర్వే చేసి పరిష్కరిస్తామని చెప్పారన్నారు. నెలరోజుల్లో కలెక్టర్, రెవెన్యూ యంత్రాంగం గ్రామ కంఠాలను సర్వే చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారన్నారు. పరిష్కరించదగ్గ సమస్యలన్నింటినీ త్రీమెన్ కమిటీ పరిష్కరిస్తుందని తెలిపారన్నారు.

22 రకాల సమస్యలను వివరించాం

సీఎం చంద్రబాబుకు 22 రకాల సమస్యలు వివరించామని రాజధాని రైతు అప్పారావు తెలిపారు. రైతుల అన్ని సమస్యలు పరిష్కరిస్తామని ఇబ్బందులు కలగనీయమని సీఎం హామీ ఇచ్చారన్నారు. నెలరోజుల్లో త్రీమెన్ కమిటీ పరిష్కరిస్తుందన్నారు. ఎటువంటి అన్యాయం జరగనివ్వనని సీఎం చెప్పారన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న రైతులందరూ చంద్రబాబు తీసుకున్న ప్రతి నిర్ణయాన్ని స్వాగతిస్తామని, ఆమోదిస్తామని చెప్పినట్లు తెలిపారు. రాబోయో రోజుల్లో అమరావతిలో అంతర్జాతీయ విమానాశ్రయం, రైల్వేస్టేషన్, క్రికెట్ స్టేడియం, ఇంకా ఏదైనా పరిశ్రమలు రావాలంటే కొంత భూమి అవసరం అవుతుందని సీఎం చెప్పారన్నారు. హైద్రాబాద్ తరహాలో అమరావతి అభివృద్ధి చెందాలంటే 29 గ్రామాల పరిధి సరిపోదని అదే జరిగితే ఓ మున్సిపాలిటీగా మాత్రమే అమరావతి ఉంటుందని సీఎం చెప్పారన్నారు. అమరావతి పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందాలంటే వృద్ధి చెందాలంటే తాను తీసుకునే నిర్ణయాలకు రైతుల మద్దతు కావాలని సీఎం కోరాన్నారు. రాజధాని అభివృద్ధికి, రాష్ట్రాభివృద్ధికి తోడ్పడే విధంగా ఇక్కడ ఏ సంస్థలు వస్తే బాగుంటుంది, రైతులకు ఏ విధంగా ఆదాయం సమకూరుతుందో దానికి అవసరమైతే ల్యాండ్‌పూలింగ్ తీసుకోవడానికి సిద్ధంగానే ఉంటామని సీఎం స్పష్టంగా చెప్పారన్నారు.

రుణాల కోసం విన్నవించాం

క్యాపిటల్ గెయిన్ ట్యాక్స్ రెండేళ్ల మినహాయింపు అడగడంతో.. కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్‌తో మాట్లాడి చేస్తామని సీఎం సమాధానమిచ్చారని రైతు ఇడుపులపాటి సీతారామయ్య తెలిపారు. గుంటూరు, విజయవాడ కంటే అమరావతిలో ఏఎస్‌ఐ కొంచెం పెంచమని అడిగామన్నారు. కమర్షియల్ ప్లాట్, రెసిడెన్షియల్ ప్లాట్లు పరిశీలించి చేస్తామన్నారు. న్యాయబద్ధంగా ఉన్న గ్రామ కంఠాలు చేస్తామన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ప్లాట్‌పై రుణాలకు 30 ఏళ్ల లింక్ డాక్యుమెంట్స్ బ్యాంకుల్లో అడుగుతున్నారని.. అలా లేకుండా లోన్ ఇచ్చేలా చూడాలని సీఎంను కోరామని రాజధాని రైతు ఇడుపులపాటి సీతారామయ్య తెలిపారు.

రైతులను మోసం చేసిన వైసీపీ సర్కార్

- ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

నాదెండ్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా అమలు చేయని రైతు ద్రోహి జగన్ అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు విమర్శించారు. మండలంలోని గణపవరం గ్రామంలో రైతన్నా నీ కోసం కార్యక్రమంలో భాగంగా ఆయన పర్యటించారు. కెల్లంపల్లి భద్రాచలం ఉన్నత పాఠశాల ఎదుట రూ.10 లక్షల వ్యయంతో మురుగు కాలువల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడిన ఆయన ధరల స్థిరీకరణ కోసం విపత్తు నిధితో రైతులను ఆదుకుంటానన్న జగన్.. తన నిధిని మాత్రం బాగా పెంచుకున్నారని ఆరోపించారు. అధికారం కోసం రైతులను వాడుకున్న జగన్ వారిని మోసగించిన ఏకైక నాయకుడిగా చరిత్రలో నిలిచిపోతారన్నారు. ప్రాజెక్టుల నిర్మాణం పూర్తి చేసి ప్రతి ఎకరాకు సాగు నీరు అందించాలని, గిట్టుబాటు ధర కల్పించాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ కరిముల్లా, మునిసిపల్ చైర్మన్ రఫానీ, ఫ్లోర్ లీడర్ గంగా శ్రీనివాసరావు, డైరెక్టర్ కందుల రమణ, సొసైటీ అధ్యక్షుడు పెంటాల శేషయ్య, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే పుల్లారావు

హత్య కేసులో నిందితులకు యావజ్జీవం

కారంపూడి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): హత్య కేసులో నిందితులకు యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ గురజాల పదో అదనపు జిల్లా జడ్జి ప్రియదర్శిని గురువారం తీర్పునిచ్చారు. మండలంలోని పేట సన్నిగండ్లకు చెందిన చప్పిడి వెంకటేశ్వర్లు, సోదరుడు మల్లయ్య కుమారులు చప్పిడి అంజయ్య, శంకర్, నరసింహారావు, అయ్యప్పల మధ్య 2.50 ఎకరాల భూవివాదం నెలకొంది. 2016 జూలై 19న చప్పిడి వెంకటేశ్వర్లు తన కుమారుడు వెంకటనరసయ్య, చిన్న కుమార్తె ఆదిలక్ష్మి, కూలి ఏసురత్నంతో కలిసి పొలానికి వెళ్లి వ్యవసాయ పనులు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో వెంకటేశ్వర్లు అన్న మల్లయ్య కుమారులు అంజయ్య, శంకర్, నరసింహారావు, అయ్యప్పలు తమ ట్రాక్టర్‌తో పొలానికి వెళ్లి వెంకటేశ్వర్లు, అతని కుమారుడు వెంకట నరసయ్యతో గొడవపడి గొడ్డలి, వేట కొడవళ్లతో దాడి చేశారు. వెంకట నరసయ్యపై విచక్షణా రహితంగా దాడి చేసి.. తలను శరీరం నుంచి వేరు చేశారు. తన కుమారుడిని రక్షించుకోవాలనే ఆత్రుతతో అడ్డుకోబోయిన వెంకటేశ్వర్లును శంకర్ వేట కొడవలితో వీపుపై నరికాడు. ప్రాణభయంతో వెంకటేశ్వర్లు, ఆదిలక్ష్మి, ఏసురత్నం అక్కడి నుంచి పారిపోయారు. వెంకటేశ్వర్లు పోలీసులకు జరిగిన సంఘటనపై ఫిర్యాదు చేశారు. అప్పటి కారంపూడి ఎస్‌ఐ టి.నారాయణస్వామి కేసు నమోదు చేశారు. గురజాల సీఐ అలహరి శ్రీనివాస్ కేసు దర్యాప్తు చేపట్టారు. 2016 ఆగస్టు 8న నిందితులను అరెస్ట్ చేసి గురజాల అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో చార్జి షీటు దాఖలు చేశారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సూర్యరాజు వాదనలతో ఏకీభవించిన జిల్లా కోర్టు నాలుగో నిందితుడు చప్పిడి అయ్యప్ప ఈ నెల 17న కాలువలో పడి మృతిచెందడంతో మిగిలిన ముగ్గురు నిందితులకు యావజ్జీవ కారాగార శిక్ష, రూ. 1000 జరిమానా విధించారు. రెండో నిందితునికి పదేళ్ల జైలు శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

రైతు సంక్షేమమే కూటమి ధ్యేయం

- టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి

నరసరావుపేట టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రైతు సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని.. దానిలో భాగంగా రైతన్నా మీ కోసం కార్యక్రమం తీసుకొచ్చిందని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ పేర్కొన్నారు. గత ప్రభుత్వం వల్ల రాష్ట్రానికి అప్పులు అధికంగా ఉన్నా సరే వాటిని అధిగమించి రైతుల కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేస్తున్నారని చెప్పారు. వ్యవసాయానికి పెట్టుబడి సాయంగా ఏడాదికి రూ.20 వేలు కేంద్రప్రభుత్వం ఇచ్చే సాయంతో కలిపి అందిస్తున్నామన్నారు. రైతులు అధిక దిగుబడి సాధించాలని, అధునాతన పద్ధతుల్లో వ్యవసాయం చేయాలన్న ఉద్దేశంతో.. రైతులకు అవగాహన కల్పించేందుకు.. కూటమి ప్రభుత్వం రైతన్నా.. మీకోసం కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు.

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య



వెంకటేష్ యాదవ్ (ఫైల్‌ఫోటో)

విజయపురిసౌత్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మాచర్ల మండలం తాళ్లపల్లి గ్రామానికి చెందిన కౌలు రైతు మర్రి వెంకటేష్ యాదవ్ (32) అప్పుల బాధతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వెంకటేష్ యాదవ్ మూడేళ్లుగా 5 ఎకరాలను కౌలుకు తీసుకొని పత్తి, మిరప పంటలు సాగు చేశాడు. పంట దిగుబడి ఆశించిన మేర రాకపోవడం, రూ.12 లక్షలు అప్పులు కావడంతో మనస్తాపానికి గురై మాచర్ల పట్టణ శివారులోని గొర్రెల మండి సమీపంలో పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న వెంకటేష్ యాదవ్‌ను కుటుంబ సభ్యులు గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. మృతునికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మాచర్ల పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం

విజయపురిసౌత్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయం నీటిమట్టం గురువారం నాటికి 582.00 అడుగులు ఉంది. ఇది 288.78 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9500, ఎడమ కాలువ ద్వారా 3972, ఎస్‌ఎల్‌బిసి ద్వారా 1800, మొత్తం ఔట్‌ఫ్లో 15,272 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో 15,272 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

రేపటి నుంచి పల్నాడు బాలోత్సవం




బ్రోచర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నరసరావుపేట కల్చరల్, నవంబరు27(ఆంధ్రజ్యోతి): పల్నాడు బాలోత్సవం ఆధ్వర్యంలో 3వ ప్రతిష్టాత్మక పిల్లల పండుగ శుక్రవారం నుంచి రెండు రోజుల పాటు జరగనున్నాయి. స్థానిక ఎస్‌ఎస్‌ఎన్ కళాశాల వేదికగా జరిగే ఈ సాంస్కృతిక పోటీల్లో జిల్లా నుంచి రెండు వందల పాఠశాలల విద్యార్థులు పాల్గొంటారని బాలోత్సవం ప్రధాన కార్యదర్శి కట్టా కోటేశ్వరరావు గురువారం తెలిపారు. మొత్తం 69 అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన 5 వేదికలపై ఏకకాలంలో పోటీలు జరుగుతాయని తెలిపారు. కోలాటం, శాస్త్రీయ నృత్యం, బుర్రకథ, విచిత్ర వేషధారణ వంటి అంశాలు బాలోత్సవంలో ప్రధాన ఆకర్షణ ఉంటాయన్నారు. జూనియర్, సబ్ జూనియర్, సీనియర్ కేటగిరిలలో పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు. కార్యక్రమానికి ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ముఖ్యఅతిథులుగా పాల్గొంటున్నట్లు చెప్పారు.

అంతర్‌రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

- 22 ద్విచక్ర వాహనాలు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ బి.ఉమామహేశ్వర్

బాపట్ల, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): బాపట్ల జిల్లాలో వరుస ద్విచక్రవాహనాల దొంగతనం కేసులను సీసీఎస్, అమర్తలూరు పోలీసులు సంయుక్తంగా ఛేదించారు. దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్‌రాష్ట్ర దొంగల ముఠాను చాకచక్యంగా అరెస్ట్ చేశారు. గురువారం ఎస్పీ బి.ఉమామహేశ్వర్ జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించి, కేసు వివరాలను వెల్లడించారు. యద్దనపూడి మండలం చిమటవారిపాలేనికి చెందిన థంకసాల సుబ్బారావు తన డీలక్స్‌బైక్ అమర్తలూరు మండలం ఇంటూరు గ్రామంలో గత జూన్‌లో గుర్తుతెలియని వ్యక్తులు దొంగలించారన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. వరుస ద్విచక్ర వాహనాల దొంగతనాలు చోటు చేసుకోవటంతో దీనిపై దృష్టిసారించారు. బాపట్ల సీసీఎస్ డీఎస్పీ పి.జగదీష్‌నాయక్ ఆధ్వర్యంలో సీసీఎస్ సీఐ ప్రేమయ్య, అమర్తలూరు ఎస్సై రవితేజ, సిబ్బందితో రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానం సాయంతో.. అంతర్‌రాష్ట్ర ద్విచక్ర వాహనాల దొంగలు ఆరుగురును అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. రూ.16.5లక్షల విలువ గల 22 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. వినుకొండకు చెందిన కొమ్మ వెంకటసాయి, కొమ్మ సాయికృష్ణ, సంపంగలి నాని, సయ్యద్ నాగూర్‌వలి, పందుల రమేష్‌బాబు, పొదలికి చెందిన బండి శివారెడ్డి నిందితులని చెప్పారు. సీసీఎస్, అమర్తలూరు పోలీసులను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి, క్యాష్‌రివార్డులను అందజేశారు. సీసీఎస్ డీఎస్పీ జగదీష్‌నాయక్, రేపల్లె డీఎస్పీ శ్రీనివాసరావు, సీసీఎస్ సీఐ ప్రేమయ్య, చుండూరు సీఐ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి మంత్రి లోకేశ్ అభినందన



మురళీమోహన్‌ను అభినందిస్తున్న మంత్రి లోకేశ్

భట్టిప్రోలు (కొల్లూరు), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఈ నెల 25న నిర్వహించిన మాక్ అసెంబ్లీలో సహాయ సహకారాలు అందించిన వెల్లటూరు జడ్పీ పాఠశాల సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు గుర్రం మురళీమోహన్‌ను రాష్ట్ర విద్యా మంత్రి నారా లోకేశ్ గురువారం అభినందించారు. మాక్ అసెంబ్లీ కార్యక్రమానికి క్వశ్చర్ అవర్‌కు సంబంధించిన స్క్రిప్ట్ రైటింగ్, శాసనసభ బిల్లుల తయారీలో మురళీమోహన్ విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. సీఎం చంద్రబాబు, స్పీకర్, మంత్రులు విద్యార్థులు మాక్ అసెంబ్లీ అద్భుతంగా నిర్వహించారని ప్రశంసించారు. కార్యక్రమానికి పూర్తి సహాయ సహకారాలు అందించిన ఉపాధ్యాయుడు మురళీమోహన్‌ను అభినందించారు. హెచ్‌ఎం అరుణకుమారి, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా ఆయనకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

హస్నాబాద్ తండాలో కార్డెన్ సెర్చ్

విజయపురిసౌత్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మాచర్ల మండలం హస్నాబాద్ తండాలో పోలీసు, ఎక్సైజ్ అధికారులు గురువారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. మాచర్ల రూరల్ సీఐ నఫీజ్ బాషా, విజయపురిసౌత్ ఎస్‌ఐ అశోక్ ఆధ్వర్యాన గ్రామంలో తనిఖీలు జరిపారు. సరైన పత్రాలు లేని 23 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ నఫీజ్ బాషా తెలిపారు. గృహాల్లో దాచి ఉంచిన 16 గొడ్డళ్లు, 14 కత్తులు స్వాధీనం చేసుకున్నామన్నారు. నాటుసారా తయారీకి సిద్ధంగా ఉంచిన 200 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు వెల్లడించారు. ఎక్సైజ్ కేసుల్లో ఇద్దరు పాత నేరస్తులను అదుపులోకి తీసుకున్నామన్నారు. మాచర్ల పట్టణ సీఐ వెంకటరమణ, ఎక్సైజ్ సీఐ వెంకటరమణ, ప్రొబేషన్ ఎస్‌ఐ రాంబాబు పాల్గొన్నారు.

వేధింపుల కేసులో ఏడాది జైలు

యడ్లపాడు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మహిళను వేధింపులకు గురిచేయడం, బెదిరించడంతోపాటు అసభ్యకరంగా ప్రవర్తించిన నిందితుడికి న్యాయ స్థానం ఏడాది జైలు శిక్ష విధించింది. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని వంకాయలపాడు గ్రామానికి చెందిన మహిళను రోడ్డుపై వేధించడంతో.. నిందితుడు షేక్ కరిముల్లాకు చిలకలూరిపేట అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి కె.నరేంద్రరెడ్డి ఏడాది జైలు శిక్షతోపాటు రూ.3వేలు జరిమానా విధిస్తూ గురువారం తీర్పునిచ్చారు. 2020 అక్టోబరు 30న అప్పటి ఎస్‌ఐ డి.శ్రీహరి కేసు నమోదు చేయగా.. పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎస్.మహేంద్రనాథ్ వాదనలు వినిపించారు.

'అమరావతి' వేళల్లో స్వల్ప మార్పు

గుంటూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నిత్యం గుంటూరు మీదగా ప్రయాణించే 17225 నరసపూర్ - హుబ్లీ అమరావతి ఎక్స్‌ప్రెస్ కాలమాన పట్టికను ఈ నెల 30 నుంచి రైల్వే శాఖ స్వల్పంగా సవరించింది. ఈ రైలు ప్రస్తుతం గుంటూరుకు రాత్రి 9 గంటలకు వచ్చి 9.05కి బయలుదేరుతుండగా ఆదివారం నుంచి రాత్రి 9.05కి వచ్చి 9.10కి బయలుదేరుతుంది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.40 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	117, 124, 136
చికెన్ విత్ స్కిన్(కిలో)	222.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	232.00

ఐదు మండలాలకు నూతన డిప్యూటీ ఎంపీడీవోలు

వేమూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ఐదు మండలాలకు డిప్యూటీ ఎంపీడీవోలను నియమిస్తూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. చేబ్రోలు మండలం వడ్లమూడి గ్రామ పంచాయితీ కార్యదర్శిగా పని చేస్తున్న గద్దె సుభాష్‌చంద్రబోస్‌కు పదోన్నతి కల్పిస్తూ వేమూరు మండలానికి, చుండూరు అంబేద్కర్‌నగర్ గ్రామ పంచాయితీ కార్యదర్శిగా పనిచేస్తున్న భర్తీపూడి మల్లిఖార్జునను భట్టిప్రోలు మండలానికి, చుండూరు మండలం వలివేరు పంచాయితీ కార్యదర్శిగా పనిచేస్తున్న తల్లా శ్రీహరిని చుండూరు మండలానికి, తెనాలి డివిజన్ చేబ్రోలు మండలంలోని శలపాడు పంచాయితీ కార్యదర్శిగా పనిచేస్తున్న కోగంటి శ్రీలతను కొల్లూరు మండలానికి, తాడేపల్లి మండలం గురుకులంలో పనిచేస్తున్న సీహెచ్ ఉమాదేవిని అమృతలూరు మండలానికి కేటాయించింది. వీరంతా డిసెంబరు 1న బాధ్యతలు చేపట్టనున్నారు.

నేడు సీసీ రుణాల పంపిణీ

వేమూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): వేమూరు పీఎసీఎస్ ద్వారా 32 మంది రైతులకు మంజూరైన సీపీ రుణాలను శుక్రవారం ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అందజేయనున్నారు. ముందుగా గ్రామంలోని జేబీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నూతన భవనాన్ని ప్రారంభించి, బీసీ కాలనీలో అన్నదాత సుఖీభవ ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న తరువాత ఆనందబాబు రుణాల పంపిణీ కార్యక్రమానికి హాజరవుతారని క్యాంపు కార్యాలయం ప్రతినిధులు తెలిపారు. ఎన్టీఆర్ పురవేదిక వద్ద నిర్వహించే రుణాల పంపిణీ కార్యక్రమానికి కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న ఎల్‌వీ ప్రసాద్ కంటి వైద్యశాల వైద్యులు

బాపట్లరూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బాపట్ల సూర్యలంక రోడ్డులోని ప్రాడీజీ విద్యాలయంలో గురువారం ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 200 మంది చిన్నారులకు వైద్యబృందం కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాలయ ప్రిన్సిపాల్ బ్రజేష్ కానూన్‌గో మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో చిన్నారులు చాలా చిన్న వయసులోనే కంటి సమస్యలు ఎదుర్కొంటున్నారని, వాటిని ప్రారంభ దశలోనే గుర్తించి తగిన చికిత్స అందించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యాలయ డైరెక్టర్‌లు శ్రీనివాసరావు, పార్థసారథి, ఉదయచంద్రరావు, వరలక్ష్మి, ఎల్‌వీ ప్రసాద్ వైద్యసిబ్బంది, ఎన్ పిచ్చిరెడ్డి, నవీన్‌రాజు, చందు, యమున, సరళ, పవన్ పాల్గొన్నారు.

జడ్పీ పాఠశాలకు ఆర్‌వో ప్లాంట్ వితరణ

చెరుకుపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): చెరుకుపల్లి జడ్పీ పాఠశాలకు జడ్పీటీసీ దంపతులు మరివాడ పావని, మరివాడ ప్రసాద్ తమ సొంత నిధులు రూ. 1 లక్ష 60వేలతో ఆర్‌వో ప్లాంట్‌ను నిర్మించి ఇచ్చారు. గురువారం ఈ ప్లాంటును టీడీపీ సీనియర్ నాయకుడు అనగాని శివప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన జడ్పీటీసీ దంపతులను అభినందించారు. విద్యార్థుల మంచినీటి సమస్యను గుర్తించి వాటర్ ప్లాంట్‌ను నిర్మించి ఇచ్చిన జడ్పీటీసీ దంపతులకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కాటూరి లక్ష్మీనారాయణ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మత్తిభాస్కరరావు, డీసీ చైర్మన్ ఎం.రాధాకృష్ణమూర్తి, బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దివి రాంబాబు, మండల టీడీపీ అధ్యక్షుడు తాతా ఏడుకొండలు, మండల టీడీపీమాజీ అధ్యక్షుడు మల్లాది రామకృష్ణ పాల్గొన్నారు.

వ్యవసాయ కళాశాలలో పాక్ జెండా కలకలం

విచారించిన పోలీసులు ఏఐ జనరేటెడ్ అని ప్రకటన

బాపట్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బాపట్ల వ్యవసాయ కళాశాలలో పాకిస్థాన్ జెండా కలకలం రేపింది. ఓ విద్యార్థి గుండెపై కప్పుకున్నట్టు ఉన్న పాకిస్థాన్ జెండా ఫోటో సామాజిక మాధ్యమాలలో చక్కర్లు కొట్టడంతో గురువారం పోలీసులు ఇరువురు విద్యార్థులను తీసుకెళ్ళి విచారించారు. ఆకతాయి చేష్టలతో సరదాగా ఏఐ జనరేటెడ్ ఫోటోను వీరు గ్రూప్‌లో పెట్టగా అది బయటి గ్రూప్‌లలో ఫార్వార్డ్ అయిందని తెలిసింది. పైగా పాకిస్థాన్ జెండా వీడియో కావాల్సిన వారు తనకు మెసేజ్ పెట్టాలంటూ విద్యార్థి చేసిన పోస్టు చర్చనీయాంశంగా మారింది. జెండా అంశాన్ని పట్టణ పోలీసులు ముందు తీవ్రంగా పరిగణించారు. తర్వాత అది ఏఐ ద్వారా సరదాగా సృష్టించిందని తెలిసి కౌన్సిలింగ్ ఇచ్చి ఇలాంటి చేష్టలు చేయొద్దని హెచ్చరించారు. పట్టణ సీఐ ఆర్.రాంబాబు విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఎస్పీ బి.ఉమామహేశ్వర్ దీనిపై స్పందించి అన్ని కోణాలలో దర్యాప్తు చేయాలని ఆదేశించారు. సరదాగా కూడా ఇలాంటివి చేయకూడదని హెచ్చరించారు.

రేపు జిల్లా స్థాయి పారాగేమ్స్

కర్లపాలెం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 29న బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లో జిల్లా స్థాయి దివ్యాంగుల పారాగేమ్స్ నిర్వహిస్తారని యాజలి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుగుణమణి తెలిపారు. గురువారం పాఠశాలలో నిర్వహించిన మండలస్థాయి ఆటల పోటీలలో కర్లపాలెం మండలానికి చెందిన దివ్యాంగ విద్యార్థులు పాల్గొన్నారన్నారు. ఈ క్రీడలను మండల విద్యాశాఖాధికారులు మనోరంజని, విజయశ్రీ ప్రారంభించారన్నారు. ఈ కార్యక్రమంలో యాజలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పీడీ మెర్సీ, స్పెషల్ టీచర్ డి.జాన్‌శామ్యూల్, కర్లపాలెం భవిత సెంటర్ ఉపాధ్యాయులు లక్ష్మీ, ప్రసన్న, చందన పాల్గొన్నారు.

గిరిజన వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

కర్లపాలెం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కరుణ జీవన్ మినిస్ట్రీస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఇనకొల్లు పోలీసురావు నిరుపేద గిరిజన వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ప్రతి నెలా పది మందికి చేయూతనిద్దాం-చైతన్య పరుద్దాం కార్యక్రమంలో భాగంగా గురువారం గణపవరం రోడ్డు పక్కన ఉన్న 30 గిరిజన కుటుంబాలకు దుప్పట్లు అందజేశారు. దీనికి సహాయం అందించిన త్యాగరాజుకు ఆయన అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కర్లపాలెం అంబేద్కర్ సేవాసమితి అధ్యక్షుడు పేర్ల ధనుంజయరావు, గిరిజన నాయకులు ఏకశిర నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



గిరిజన వృద్ధులకు దుప్పట్లు పంపిణీచేస్తున్న కరుణ జీవన్ మినిస్ట్రీస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఇనకొల్లు పోలీసురావు తదితరులు

సగం పూర్తయిన పోలింగ్ కేంద్రాల మ్యాపింగ్

● కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్



వీడియోకాన్ఫరెన్స్‌లో రాష్ట్ర చీఫ్ ఎలక్ట్రోరల్ ఆఫీసర్ వివేక్‌యాదవ్‌కు వివరాలను వివరిస్తున్న జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్

బాపట్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పోలింగ్ కేంద్రాల మ్యాపింగ్ 49.56 శాతం పూర్తి చేసినట్లు కలెక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. రాష్ట్ర సచివాలయంలోని చీఫ్ ఎలక్ట్రోరల్ ఆఫీసర్ కార్యాలయం నుంచి రాష్ట్ర చీఫ్ ఎలక్ట్రోరల్ ఆఫీసర్ వివేక్‌యాదవ్ సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో కలెక్టర్ వినోద్‌కుమార్, డీఆర్‌వో జి.గంగాధర్‌గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, చీఫ్ ఎలక్ట్రోరల్ అధికారి ఆదేశాల మేరకు ఈఆర్‌వోలు, ఎఈఆర్‌వోలు, ఈడీటీలు, ఈఎస్ఎలకు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్-2026పై శిక్షణా కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు. జిల్లాలో నూతనంగా ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలకు బిఎల్‌వోలను నియమించటానికి ప్రతిపాదనలు పంపిస్తామని చెపారు. బిఎల్‌వోలకు ఐడికార్డులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టరేట్‌లోని ఎన్నికల విభాగం పర్యవేక్షకులు పాల్గొన్నారు. అనంతరం బాల్యవివాహ నిర్మూలనకు సొసైటీ ఫర్ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ స్వచ్ఛంద సేవా సంస్థ రూపొందించిన గోడప్రతులను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీఫార్డ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ కొమరబత్తిన రవి ప్రదీప్, కోఆర్డినేటర్ బడుగు కిషోర్, అసోసియేషన్ ఫర్ వాలంటరీ యాక్షన్ కోఆర్డినేటర్ శుభకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎత్తిపోతల పథకానికి భూసేకరణ తప్పనిసరి

యర్రం చినపోలిరెడ్డి ఎత్తిపోతల పథకంపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, ప్రాజెక్టు వినియోగంలోకి రావాలంటే భూసేకరణ తప్పనిసరి అని అన్నారు. ఎత్తిపోతల పథకానికి భూములిచ్చిన రైతులందరికీ న్యాయం జరిగేలా చూస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఉపకలెక్టర్ విజయ జ్యోతికుమారి, పమిడిపాడు గ్రామరైతులు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బాపట్ల మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి

బాపట్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బాపట్ల పురపాలక సంఘ పరిధిలోని పర్యావరణ, సంక్షేమ, మౌలిక సౌకర్యాల కార్యదర్శులకు, పారిశుధ్య మేస్త్రీలకు గురువారం శిక్షణా తరగతులు నిర్వహించారు. స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్, ఆలిండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ లోకల్ గవర్నెస్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో బాపట్ల పురపాలక సంస్థ కార్యాలయంలో ఈ శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఘన వ్యర్థాల నిర్వహణ, ప్లాస్టిక్ నిర్మూలన స్వచ్ఛ సర్వేక్షణ్ వంటి అంశాలపై శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణా తరగతులకు స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్ నుంచి శిక్షకులుగా తిరుపతిరావు, హరీష్, సుధీర్‌గోపి, కోటేశ్వరరావు శిక్షణ నిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి మాట్లాడుతూ, ప్లాస్టిక్ రహిత బాపట్ల కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మొదటిగా ప్లాస్టిక్ రహిత బాపట్ల పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం స్టీల్ వాటర్ బాటిల్స్‌ను సిబ్బందికి అందజేశారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ అబ్దుల్ జబ్బార్, డీఈ కృష్ణారెడ్డి, శానిటరి ఇన్‌స్పెక్టర్ కరుణ, ఆంధ్ర కార్పోరేషన్ ఎండి పాల్గొన్నారు.

చంద్రకళాపార్కును పరిశీలించిన మున్సిపల్ కమిషనర్

బాపట్ల పట్టణంలోని పలు వార్డులను గురువారం మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి సందర్శించి అభివృద్ధి పనులను సమీక్షించారు. 18వవార్డు చంద్రకళాపార్కును పరిశీలించి అక్కడ పిల్లల ఆటవస్తువులు దెబ్బతిన్నట్లు గుర్తించి వెంటనే మరమ్మత్తులు చేయాలని అధికారులను ఆదేశించారు. 11వవార్డు విశ్వబ్రాహ్మణ కాలనీ మున్సిపల్ పార్కును సందర్శించి పార్కులో ఉన్న సమస్యలు, అభివృద్ధి అవసరాలపై పార్కుకు వచ్చిన ప్రజలతో నేరుగా అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో శానిటరి ఇన్‌స్పెక్టర్‌లు సయ్యద్ నజీర్, కరుణ, పురపాలకసంఘ సిబ్బంది పాల్గొన్నారు.

ముస్లింల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కృషి

● ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ



ప్రమాణస్వీకారోత్సవ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ముస్లిం మైనార్టీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ స్పష్టం చేశారు. బాపట్ల పట్టణంలోని షాదీఖానా నూతన కమిటీ ప్రమాణస్వీకారోత్సవం గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ, షాదీఖానాల అభివృద్ధికి అవసరమైన సహకారాన్ని అందిస్తామని చెప్పారు. నిరుపేదలకు ఉపయోగపడేలా షాదీఖానా అందుబాటులో ఉండాలని సూచించారు. అనంతరం కమిటీ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. ఎమ్మెల్యేను నూతన కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కర్లపాలెం మండల టీడీపీ అధ్యక్షుడు వై.భూపతిరావు, ఆదంషఫీ, ఏజాస్, షేక్.దిలీప్, సయ్యద్ నియాజి, సయ్యద్ నిజాం, రఫీ, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల చిన్నారులకు ఆటల పోటీలు

భట్టిప్రోలు (కొల్లూరు), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాల చిన్నారులకు మండల స్థాయి ఆటల పోటీలు గురువారం నిర్వహించారు. సమగ్ర శిక్ష ఆంధ్రప్రదేశ్ వారి ఆదేశాల మేరకు మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో భవిత కేంద్రంలోని విద్యార్థులకు సీనియర్, జూనియర్ విభాగాల్లో వారి సామర్థ్యానికి అనుగుణంగా ఆటల పోటీలు నిర్వహించారు. డ్రాయింగ్, రన్నింగ్, మ్యూజికల్ చైర్ పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీయూపీ పాఠశాల హెచ్‌ఎం ఎం.రంగయ్య, ఉపాధ్యాయులు ఎస్‌కె వలి, కె.రత్నకర్, మేరీ ఇవాంజలిన్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



చెరుకుపల్లి బజార్లో సీసీ రోడ్డుకు భూమి పూజ చేస్తున్న అనగాని శివప్రసాద్

చెరుకుపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో అభివృద్ధి పనులను గురువారం సీనియర్ టీడీపీ నాయకుడు అనగాని శివప్రసాద్ ప్రారంభించారు. చెరుకుపల్లి సంతబజార్ రోడ్డు హైవే నుంచి శ్రీ బాలకోటేశ్వరస్వామి గుడి వరకు సీసీరోడ్డు, డ్రైయినేజీ నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. అలాగే చెరుకుపల్లి మండలం నడింపల్లి నుంచి గోవాడ వెళ్ళే బీటీ రోడ్డు నిర్మాణాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో చెరుకుపల్లి మండల టీడీపీ అధ్యక్షుడు తాతా ఏడుకొండలు, రేపల్లె నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి మత్తి భాస్కర్, డీసీ చైర్మన్ ఎం.రాధాకృష్ణమూర్తి, బీసీ సెల్‌రాష్ట్ర ఉపాధ్యక్షుడు దివిరాంబాబు, రేపల్లె మార్కెట్ యార్డు చైర్మన్ మత్తి అనురాధ, వైస్‌చైర్మన్ గోగినేని వసుధ, గూడవల్లి నీటిసంఘం అధ్యక్షులు గోగినేనిరామాంజనేయులు, టీడీపీ మాజీ అధ్యక్షులు మల్లాదిరామకృష్ణ, రేపల్లె పొలిటికల్‌మేనేజర్ కుమార్‌స్వామి, సాయిరాజేంద్ర, సొసైటీ అధ్యక్షులు దివిశ్రీనివాసరావు, చెన్నకేశవస్వామి దేవస్థానం చైర్మన్ కందులవెంకటేశ్వరరావు, అధికారులు మరియు కూటమిపార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు దివ్యాంగులకు జిల్లాస్థాయి క్రీడాపోటీలు

బాపట్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతుల దినోత్సవంలో భాగంగా దివ్యాంగులకు శుక్రవారం జిల్లాస్థాయి క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. బాపట్ల మున్సిపల్ హైస్కూల్ ప్రాంగణంలోని మినీస్టేడియంలో పోటీలు నిర్వహిస్తామన్నారు. షటిల్ బ్యాడ్మింటన్ క్రీడకు 12 నుంచి 21 సంవత్సరాల వయస్సు గల బాలబాలికలు అర్హులన్నారు. సబ్‌జూనియర్స్, సీనియర్స్ విభాగాలలో పోటీలు నిర్వహిస్తామన్నారు. అథ్లెటిక్స్‌లో అన్ని వయసులవారు అర్హులేనని చెప్పారు.

జాలర్ల ఇళ్ళు తొలగిస్తే ఉద్యమమే : సీపీఎం జిల్లా కార్యదర్శి

బాపట్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సూర్యలంక సముద్రతీరంలో దశాబ్దాలుగా నివాసాలు ఏర్పాటు చేసుకొని జీవిస్తున్న కుటుంబాలను ఖాళీ చేసి వెళ్ళాలంటూ నోటీసులివ్వటం సరికాదని సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య పేర్కొన్నారు. ఈ విషయమై గురువారం సూర్యలంక తీరాన్ని సందర్శించిన ఆయన బాధిత కుటుంబాలవారితో మాట్లాడారు. ఇళ్ళు తొలిగిస్తే ఉద్యమం చేపడతామని తెలిపారు. అధికారులిచ్చిన నోటీసులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కృష్ణమోహన్, కె.శరత్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న బాపట్ల జిల్లా పీసీసీ పరిశీలకులు శరత్ అహార్

రేపల్లె, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మధ్యప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ పీసీసీ ప్రెసిడెంట్, బాపట్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ పరిశీలకులు శరత్ అహార్ అన్నారు. గురువారం పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాజీవ్‌గాంధీ ఆశయాలకు అనుగుణంగా ఎన్డీఏ విధానాలకు వ్యతిరేకంగా సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ చేపడుతున్న పాదయాత్రకు కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు మద్దతు పలకాలని అన్నారు. రాష్ట్రంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పోటీ చేస్తుందని ఆయన తెలిపారు. రేపల్లె నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మోపిదేవి శ్రీనివాసరావు మాట్లాడుతూ, రేపల్లె నియోజకవర్గానికి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిగా తప్పుకుంటున్నట్లు ప్రకటించారు. మంచి అనుభవం ఉన్న సీనియర్‌పార్టీ నాయకులకు నియోజకవర్గ బాధ్యతలు అప్పజెప్పాలని వారికి తన సహాయ, సహకారాలు అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంటా అంజిబాబు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కొపనాతి అంజిబాబు, పి.నారాయణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సచివాలయాల అధికారిగా సుజాత



ఎంపీడీవో నుంచి అనుమతి పత్రాన్ని స్వీకరిస్తున్న బండ్లమూడి సుజాత

పిట్టలవానిపాలెం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పిట్టలవానిపాలెం మండల పరిషత్ సచివాలయాల (సీఏఎస్ జీఏఎస్‌డబ్ల్యూఎస్) అధికారిగా బండ్లమూడి సుజాత గురువారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఆమె ప్రస్తుతం చందోలు గ్రామ పంచాయతీ కార్యదర్శిగా, సంగుపాలెం గ్రామపంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నారు. మర్యాదపూర్వకంగా పిట్టలవానిపాలెం ఎంపీడీవో సి.హెచ్.శేఖర్ ద్వారా అనుమతి పత్రాన్ని పొందారు. మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, ఆయా గ్రామ సచివాలయాల సిబ్బంది ఉద్యోగులు ఈ సందర్భంగా సుజాతకు అభినందనలు తెలియజేశారు.

● ఖాజీపాలెం గ్రామపంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న దాసరి వెంకట శివకుమార్ పదోన్నతిపై నిజాం పట్టణం మండలానికి సీఏఎస్ జీఏఎస్‌డబ్ల్యూఎస్ అధికారిగా నియమితులయ్యారు. అల్లూరు గ్రామపంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న డి.పద్మావతి పదోన్నతిపై సీఏఎస్‌జీఏఎస్‌డబ్ల్యూఎస్ అధికారిగా కర్లపాలెం మండలానికి నియమితులయ్యారు.

● అలకాపురం గ్రామపంచాయతీ కార్యదర్శి ఎల్.నందకిషోర్ అల్లూరు గ్రామపంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శిగా నియమితులయ్యారు. పిట్టలవానిపాలెం గ్రామపంచాయతీ కార్యదర్శి ఎన్.ప్రసాదరావు ఖాజీపాలెం గ్రామపంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శిగా నియమితులయ్యారు.

మైదానాలకు అనువైన ప్రాంతాలు పరిశీలన

బాపట్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్పోర్ట్స్‌ను ముందుకు నడిపించటంలో భాగంగా అనువైన క్రీడా మైదానాలు ఎక్కడెక్కడ ఉన్నాయో గుర్తించటం కోసం స్పోర్ట్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.భరణి బాపట్లలో పర్యటించారు. బాపట్లలోని వ్యవసాయ కళాశాల క్రీడామైదానం, బాపట్ల మినీస్టేడియం, చీరాల ఇండోర్‌స్టేడియం, హైదర్‌పేటలోని ఓపెన్ ప్రదేశం, వాటర్‌స్పోర్ట్స్‌కు అవసరమైన నల్లమడ డ్రైన్, పాండు రంగాపురం బీచ్, సూర్యలంక బీచ్, చీరాల ఓడరేవులను పరిశీలించారు. ఎక్కడెక్కడైతే వాటర్‌స్పోర్ట్స్‌కు ఉపయోగకరంగా ఉన్నాయో పరిశీలించి గుర్తించారు. దీనిపై స్పోర్ట్స్ ఎక్స్‌పర్ట్స్‌ను పిలిపించి సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ వినోద్‌కుమార్‌తో సమావేశమయ్యారు. కార్యక్రమంలో డీఎస్‌డీవో ఎస్.శ్రీనివాసరావు, టెక్నికల్ కోచ్‌లు పాల్గొన్నారు.



ఇండోర్‌స్టేడియంను పరిశీలిస్తున్న స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్ భరణి

రైతుల ఆర్థిక స్థిరత్వమే ప్రభుత్వ ధ్యేయం

● ఎమ్మెల్యే ఆనందబాబు



రైతన్నా మీ కోసం ఇంటింటి ప్రచారంలో ఎమ్మెల్యే ఆనందబాబు

కొల్లూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రైతు కుటుంబాలకు ఆర్థిక స్థిరత్వం కల్పించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పేర్కొన్నారు. గురువారం కొల్లూరులో రైతన్నా మీ కోసం-అన్నదాత సుఖీభవ ఇంటింటి ప్రచారంలో ఆయన పాల్గొని రైతులు, ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కల్పించారు. ఈ ప్రచార కార్యక్రమంలో రేపల్లె ఏడీఈ లక్ష్మి, తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు, ఎంపీడీవో కె.నరసింహారావు, మండల టీడీపీ అధ్యక్షులు మైనేని మురళీకృష్ణ, ఎఎంసీ చైర్మన్ గొట్టిపాటి పూర్ణకుమారి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా, గాజుల్లంక పీఏసీఎస్ అధ్యక్షుడు గాజుల తిరుపతివెంకయ్య, ఏఎంసీ డైరెక్టర్ పోతార్లంక కుటుంబరావు, పార్టీ నాయకులు సుంకర శ్రీను, వేములపల్లి మోహనకృష్ణ, పెదపూడి నాగరాజు, తుమాటి శ్యాంబాబు, ఏడుకొండలు, యడ్ల శ్రీను, బుర్రి జగన్, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత

వేమూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్లబాడు గ్రామానికి చెందిన వెల్లబాటి వంశీ ఇటీవల అనారోగ్యంతో ప్రైవేట్ వైద్యశాలలో చేరి చికిత్స పొందాడు. వైద్యానికి అవసరమైన ఖర్చుల నిమిత్తం ప్రభుత్వ సహాయాన్ని కోరుతూ ఎమ్మెల్యేకు లేఖ రాయగా ఆఆయన స్పందించి సీఎం సహాయ నిధి నుంచి రూ.2 లక్షల ఆర్థిక సహాయాన్ని మంజూరు చేయించారు. సంబంధిత చెక్కును గురువారం లబ్ధిదారు వంశీకి అందజేశారు. ఈ సందర్భంగా వంశీ కుటుంబసభ్యులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఎమ్మెల్యే ఆనందబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

పార్వతీ అమ్మవారికి వెండి గ్లాసు సమర్పణ



అమ్మవారికి వెండి గ్లాసు, ఉద్దరిణి సమర్పిస్తున్న దాత మురళీధర్ కుటుంబసభ్యులు

కొల్లూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కొల్లూరులోని అనంత భోగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో వేంచేసియున్న పార్వతీ అమ్మవారికి గోలి మురళీధర్ దంపతులు వారి కుటుంబసభ్యులు 75 గ్రాముల వెండి గ్లాసు, ఉద్దరిణిని సమర్పించారు. ఆలయ అర్చకులు గాడేపల్లి శివశర్మకు వీటిని అందించగా, అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి దాత కుటుంబసభ్యులకు ఆశీస్సులు అందజేశారు.

కొనుగోలు కేంద్రాల్లో సమన్వయంతో సేవలందించాలి

● మండల ప్రత్యేక అధికారి డాక్టర్ వేణుగోపాల్



తేమ శాతం యంత్రం పనితీరు పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి వేణుగోపాల్

భట్టిప్రోలు (కొల్లూరు), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సిబ్బంది సమన్వయంతో సేవలు అందించాలని మండల ప్రత్యేక అధికారి డాక్టర్ బి.వేణుగోపాల్ పేర్కొన్నారు. గురువారం భట్టిప్రోలుతో పాటు మండల పరిధిలోని ఐలవరం గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సిబ్బంది రైతులకు మెరుగైన సేవలందించాలన్నారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని విక్రయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు, డిప్యూటీ తహసీల్దార్ శాంతలక్ష్మి, ఏవో బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు.

బాపట్ల ఫార్మసీ కళాశాలలో గెస్ట్ లెక్చర్ కార్యక్రమం



గెస్ట్ లెక్చర్ కార్యక్రమంలో పాల్గొన్న బాపట్ల ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కే సిద్దార్థ

బాపట్లరూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బాపట్ల ఫార్మసీ కళాశాలలో గురువారం గెస్ట్ లెక్చర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.సిద్దార్థ మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో ఎన్నో కొత్త రోగాలు వస్తున్నాయని వాటి పట్ల సరైన అవగాహన ముఖ్యమని అన్నారు. ఫార్మా డీ విద్యార్థులు వ్యాధుల చికిత్స సరళిని ఎప్పటికప్పుడు అనుసరిస్తూ నూతన విధానాలను తెలుసుకునేందుకు ఆసక్తి, చొరవ చూపించాలని సూచించారు. ఈ సందర్భంగా బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు, సెక్రటరీ మానం నాగేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు నిర్వాహకులను డాక్టర్ సిద్దార్థ అభినందించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టిఇజికె.మూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె.సుష్మా పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, భోజన ప్లేట్ల పంపిణీ

కర్లపాలెం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్‌ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు గురువారం పెదగొల్లపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, భోజన ప్లేట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయిని సుబాషిణి మాట్లాడుతూ, దాతలు ప్రభుత్వ పాఠశాలకు సహకరించటం ఎంతో ముదావహమన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు పులిగడ్డ రామారావు, వెంకటేశ్వరరావు, వైఎస్‌రావు, అసోసియేషన్ సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు మల్లికార్జునరెడ్డి, ఆదంబి బాపూజిరెడ్డి, హేమలత, నాగరాజు పాల్గొన్నారు.



విద్యార్థినికి పరీక్ష ప్యాడు, భోజన ప్లేటు పంపిణీ చేస్తున్న ఏపీఎస్‌ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు



హోమ క్రతువు నిర్వహిస్తున్న వేద పండితులు



దేవాలయ నమూనా గ్యాలరీని తిలకిస్తున్న సీఎం చంద్రబాబు

శ్రీవారి చిత్తంతోనే.. అమరావతి

(3వ పేజీ తరువాయి)



మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

చేస్తున్నామని చెప్పారు. అమరావతినే కాకుండా, ఈ ప్రాంతాన్ని కాపాడే శక్తి ఈ దేవాలయానికి ఉందన్నారు. గత ప్రభుత్వం విధ్వంసం తప్ప మంచి చేసిన సందర్భాలు లేవని, మంచి సంకల్పంతో రైతులు భూములు ఇస్తే నరకాన్ని చూపించారన్నారు. రైతులు వేంకటేశ్వరస్వామిని నమ్ముకుని న్యాయస్థానం నుంచి దేవస్థానం వరకు యాత్ర చేసి రాజధానిని కాపాడుకోవడానికి పోరాడారన్నారు. కార్యక్రమం లో మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరి నారాయణ, నాదెండ్ల మనోహర్, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, సభ్యులు జానకీదేవి, భానుప్రకాశ్, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, పెద్ద సంఖ్యలో రాజధానిప్రాంత రైతులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.



కార్యక్రమానికి హాజరైన అభిమానులు, భక్తులు

పుడమి తల్లి రుణం తీర్చుకోవాలి

(3వ పేజీ తరువాయి)

ఎమ్మెల్యేలు ఇప్పుడు దారి తప్పుతున్నారని, వారు చెబితేనే ఏ పనైనే చేసేందుకు అధికారులు అలవాటు పడ్డారని, ఇటువంటి పరిస్థితుల్లో పేదలకు సంక్షేమం అందటం కష్టమవుతుందన్నారు. అమ్మ భాషను మర్చిపోయినవాడు అసలు మనిషే కాదన్నారు. సాటి మనిషికి సేవ చేయడం గొప్ప భాగ్యమని, దీనికి దుర్గా కమేశ్వరరావు ఒక ఆధునిక రుషిలా పాటుపడ్డారని కొనియాడారు. నేటి ప్రభుత్వాలు చేపలు పట్టడం నేర్పటం కాకుండా, ఏకంగా చేపలనే అందిస్తున్నారని, దీనివల్ల మనిషిలో నిపుణత తగ్గిపోతుందన్నారు. సోమరితనం పెరిగిపోయి దేశ భవిష్యత్తుకు ప్రమాదకరంగా మారుతుందన్నారు.

అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ దేశ విదేశాల్లో తెలుగు కీర్తిని పెంచిన వ్యక్తి వెంకయ్యనాయుడని, ఆయనను మాజీ ఉపరాష్ట్రపతి అంటే సరిపోదని, అపూర్వ ఉపరాష్ట్రపతి అని పిలవడం సముచితమన్నారు. తెలుగు రాష్ట్రాల ప్రతిష్ఠను వెంకయ్యనాయుడు పెంచితే, సేవకు ప్రతిరూపంగా డాక్టర్ పీడీకే రావ్‌ను చెప్పుకోవచ్చన్నారు. సేవకుడి



పురస్కారం అందుకున్నాక సభలో మాట్లాడుతున్న డాక్టర్ పీడీకే రావ్

గా, పేదల పాలిట పెన్నిధిగా నిలిచిన కామేశ్వరరావు వంటి సేవా శిఖరాన్ని సత్కరించుకోవడం గొప్ప విషయమన్నారు. సభకు అధ్యక్షత వహించిన ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మట్లాడుతూ మాతృ దేశం, బాష కోసం పాటుపడే గొప్ప వ్యక్తి వెంకయ్యనాయుడు అయితే, పేదలకోసం పాటుపడటంలో ఒక వ్యక్తే మహోన్నత శక్తి అవుతుందన్న విషయాన్ని నిరూపించిన మహామనిషిగా కామేశ్వరరావు నిలుస్తారన్నారు. అటువంటి గొప్ప వ్యక్తికి తెనాలిలో పురస్కారం అందించుకోవడం గొప్ప భాగ్యంగా భావిస్తున్ననన్నారు. అవార్డు గ్రహీత కామేశ్వరావు మాట్లాడుతూ తను ఇంతటి పురస్కారానికి అర్హుడినో కాదో కానీ, తనకు నచ్చిన పని నేను చేసుకు వెళ్లానని, అది అందరికీ గొప్ప విషయంగా కనిపించడం గర్వంగా ఉదన్నారు. చీపురుపల్లి వంటి మారుమూల గ్రామాల్లో వెనుకబడిన వారు ఎదుర్కొంటున్న సమ్యలు, పేదరికం వంటివాటిపై తనవంతు సేవ చేశానన్నారు. సేవ చేసేటప్పుడు కూడా బెదిరింపులు, కేసులు తప్పలేదని, అన్నిటికీ తట్టుకుని తాను ఎంచుకున్న మార్గంలోనే నడిచానన్నారు. తన సేవలను గుర్తించి పురస్కారం ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. తన 84 ఏళ్ల జీవితంలో ఇది మరిచిపోలేని రోజన్నారు. సభలో హైకోర్టు న్యాయవాది ఇంద్రనీల్, రోటరీక్లబ్ అధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వరరావులు ప్రసంగించారు. ఓలేటి పార్వతీశం పరిచయ కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమంలో కుమార్ పంప్స్ అధినేత కొత్త సుబ్రహ్మణ్యం, డబుల్ హార్స్ మినపగుళ్ల పరిశ్రమ అధినేత మునగాల మోహన్ శ్యాంప్రసాద్, చిత్రకారుడు గిరిధర్ పాల్గొన్నారు.

కోడిగుడ్డు.. అధరహో



● హోల్‌సేల్‌లోనే రూ.6.40 ● చిల్లర దుకాణాల్లో ధర రూ.8

గుంటూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మార్కెట్లో కోడి గుడ్డు ధర అదరగొడుతోంది. గత నెలలో హోల్‌సేల్‌లో రూ.6 లోపు ఉన్న ధర క్రమంగా పెరుగుతూ తాజాగా రూ.6.40కి చేరింది. ఒకవైపు కూరగాయల ధరలతో పాటు కోడి గుడ్డు ధరలు అమాంతం పెరగడంతో సామాన్యులు ఏమి తినాలోనని ఆవేదన చెందుతున్నారు. సాధారణంగా మాంసాహార ప్రియులతో పాటు ఇతర వర్గాలవారు కోడి గుడ్డు అంటే ఇష్టపడతారు. కొందరైతే నిత్యం ఆహారంలో కోడిగుడ్డును భాగం చేసుకుంటారు. నవంబరు మొదటి వారంలో 100 గుడ్ల ధర రూ.585 ఉండేది. క్రమంగా పెరుగుతూ అది రూ.660 వరకు చేరింది. ఇక విజయవాడ జోన్ నెక్ వారు శుక్రవారం ధర రూ.640గా ప్రకటించారు. కాగా గతంలో 30 గుడ్ల ట్రే రూ.180 నుంచి రూ.200 లోపు ఉండేది. ప్రస్తుతం పెరిగిన ధరతో 30 గుడ్ల ట్రే రూ.210 నుంచి రూ.220 వరకు విక్రయిస్తున్నారు. హోల్‌సేల్ ధరలు ఇలా ఉంటే చిల్లర దుకాణాల్లో రెండు గుడ్లు రూ.15, గుడ్డు రూ.8 అంటూ ఇష్టానుసారంగా వి క్రయిస్తు న్నారు. చలికాలం ప్రారంభంతో సహజం గానే కో డిగుడ్ల ఉత్పత్తి సాధారణం కంటే కొంత తక్కు వగానే ఉంటుందని పౌల్ట్రీ వర్గాలు తెలిపాయి. ఉత్పత్తి తగ్గడంతో పాటు ఇదే సమయంలో ఎగుమతులు పెరగడంతో కోడిగుడ్లకు డిమాండ్ పెరిగింది. ఈ కారణంగా ధరలు పెరిగా యని హోల్‌సేల్ వ్యాపారి యర్రబోతు వెంకటరమణ తెలిపారు. ఇవే ధరలు మరికొంత కాలం ఉండే అవకాశం ఉంటుందని పౌల్ట్రీ వ్యాపారులు తెలిపారు.

నానో యూరియా

(3వ పేజీ తరువాయి)

అమ్మకాల బాధ్యతను డీసీఎంఎస్, మార్క్‌ఫెడ్‌కు అప్పగించింది. ప్రస్తుతం జిల్లాలకు వస్తున్న యూరియా నిల్వల్లో 70 శాతం డీసీఎంఎస్, సొసైటీ లకు, 30 శాతం ప్రైవేట్ డీలర్లకు కేటాయిస్తున్నారు.

అక్కడ కూడా అదే గోల

డీసీఎంఎస్, సొసైటీల ద్వారా యూరియా అమ్మకాలు జరుపుతున్నప్పటికీ నానో యూరియా బాధలు రైతులకు తప్పడం లేదు. గత ఖరీఫ్ సీజన్‌లో మూడు బస్తాలు యూరియా తీసుకుంటే ఒక లీటర్ నానో యూరియా తీసుకోవాలని ముడిపెట్టారు. రబీలో కూడా అదే పరిస్థితి కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. రానురాను ఘన యూరియా వాడకం తగ్గించి రైతులను ద్రవ నానో యూరియా వైపునకు మళ్లించాలని కేంద్రం ఆలోచిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. అయితే రైతులు మాత్రం నానో యూరియా వాడేందుకు పెద్దగా ఆసక్తి చూపించకపోవడంతో దాని కొనుగోలు వారికి భారంగా మారింది. ఒక వేళ నానో యూరియా తీసుకోకుంటే యూరియా ఇవ్వమని రైతుల ముఖం మీదే చెబుతున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు.

రూ. 250 వృథానే

నానో ఎరువులు తీసుకోకుంటే యూరియా ఇవ్వరన్న ఆలోచనతో రైతులు అవసరం ఉన్నా- లేకున్నా కొనుగోలు చేస్తున్నట్లు చెబుతున్నారు. మూడు యూరియా బస్తాల కోసం రూ.799.50 వెచ్చిస్తే, నానో యూరియా కోసం రూ. 250 వరకు చెల్లిస్తున్నారు. నానో ఎరువులను బలవంతంగా కొన్నా.. వాడటం లేదని రైతులు చెబుతున్నారు. ఈ విషయం పై అధికారులు దృష్టి సారించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పరిశ్రమల భాగస్వామ్యంతోనే
పర్యావరణ పరిరక్షణ

● ఏపీ పీసీబీ చైర్మన్ కృష్ణయ్య

గుంటూరు(తూర్పు), నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో పరిశ్రమలు భాగస్వామ్యం తప్పనిసరి అని ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి బోర్డు(ఏపీ పీసీబీ) చైర్మన్ పి.కృష్ణయ్య అన్నారు. ఇండస్ట్రీ పర్యావరణ పర్యవేక్షణ, సమీక్ష కార్యక్రమంలో భాగంగా గుంటూరులోని ఐటీసీ హోటల్, హిందుస్థాన్ రీసైక్లింగ్ హబ్‌ను గురువారం ఆయన సందర్శించారు. ఐటీసీ హోటల్లోని ఉత్పత్తి అయ్యే తడి వ్యర్థాలను శాస్త్రీయంగా నిర్వహించేందుకు 200 కిలోల సామర్థ్యం కలిగిన ఆర్గానిక్ వేస్ట్ కంపోస్టింగ్ యంత్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ యంత్రం ద్వారా ఉత్పత్తి అయ్యే కంపోస్టును ప్రాంగణంలో ఎరువుగా వినియోగిం చడంతో పాటు, బయట నర్సరీలకు పంపిణీ చేస్తున్నట్లు చైర్మన్‌కు హోటల్ మేనేజ్‌మెంట్ వివరించింది. ఈ సందర్భంగా పర్యావరణహిత వ్యర్థ నిర్వహణ సమర్థంగా అమలు చేస్తున్నం దుకు మేనేజ్‌మెంట్‌ను అభినందించారు. అనంతరం హిందుస్థాన్ రీసైక్లింగ్ హబ్‌ను సందర్శించి వాహనాల రీసైక్లింగ్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. తుక్కును పర్యావరణానికి హాని కలిగించకుండా, అనుబంధ పరిశ్రమల్లో వినియోగించి, విలువ ఆధారిత ఉత్పత్తులుగా మార్చే అవకాశాలను అన్వేషించాలని మేనేజ్‌మెంట్‌కు చైర్మన్ సూచించారు. ఈ సందర్భంగా చైర్మన్‌కు ఈ రెండు పరిశ్రమలు చేపట్టిన పర్యావరణ హిత కార్యక్రమాలు, వాటి నిర్వహణ విధానాలు గురించి జిల్లా పర్యావరణ ఇంజనీరు నజీనా బేగం వివరించారు. అనంతరం ఈ రెండు పరిశ్రమల ఆవరణల్లో పి.కృష్ణయ్య, నజీనా బేగం మొక్కలు నాటారు. ఆయా పరిశ్రమల ఉద్యోగులు, కాలుష్య నియంత్రణ మండలి సిబ్బంది పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న ఏపీపీసీబీ చైర్మన్ పీ కృష్ణయ్య, పాల్గొన్న జిల్లా పర్యావరణ ఇంజనీరు నజీనా బేగం



ఆర్టీసీ ప్రయాణికులకు చల్లనికబురు

ఏసీ సర్వీసుల్లో చార్జీలపై 10 శాతం రాయితీ

డిసెంబరు 1 నుంచి 20 వరకు అవకాశం

గుంటూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఏసీ సర్వీసులకు ప్రయాణికులను ఆకర్షించేందుకు సంస్థ ప్రయాణ చార్జీలపై 10 శాతం రాయితీ ప్రకటించింది. ఈ రాయితీ డిసెంబరు ఒకటో తేదీ నుంచి 20వ తేదీ వరకు అమల్లో ఉండనున్నది. అయితే ప్రయాణికులు రద్దీ ఉండే ఆదివారం రోజున రాయితీని మినహాయిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఆయా బస్టాండ్ల నుంచి రాకపోకలు సాగించే ఇంద్ర, అమ రావతి ఏసీ సర్వీసులలో ఈ రాయితీ వర్తిస్తుందన్నారు. రాయితీ చార్జీలను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని డీపీటీవో సామ్రాజ్యం తెలిపారు.

రాయితీ ధరలు ఇలా....

రూట్	సర్వీసు	పాత ధర	రాయితీ ధర
గుంటూరు టూ బీహెచ్ఈఎల్ వయా మిర్యాలగూడ	అమరావతి	870	790
గుంటూరు టూ బీహెచ్ఈఎల్ వయా విజయవాడ	అమరావతి	970	880
గుంటూరు టూ బీహెచ్ఈఎల్ వయా మిర్యాలగూడ	ఇంద్ర	700	640
తెనాలి టూ బీహెచ్ఈఎల్	ఇంద్ర	770	710
తెనాలి టూ విశాఖపట్నం	ఇంద్ర	960	880

నా సంతకం ఫోర్జరీ చేసి.. నగదు డ్రా చేశారు

● పంచాయతీ కార్యదర్శిపై సర్పంచ్ ఫిర్యాదు



విలేకర్లతో మాట్లాడుతున్న పోట్లూరు సర్పంచ్ జ్యోతి

శావల్యాపురం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తన సంతకాన్ని పంచాయతీ కార్యదర్శి ఫోర్జరీ చేసి.. పనులు చేసినట్లుగా బిల్లులు పెట్టి ఖాతాలోని నగదును దోచేశాడని పోట్లూరు గ్రామ సర్పంచ్ పోపూరి జ్యోతి గురువారం ఎంపీడీవో పేరుమీన సీతారామయ్యను కలసి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. అనంతరం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ పోట్లూరు పంచాయతీ కార్యదర్శి పంచాయతీ ఖాతా నుంచి ఆరు విడతలుగా రూ.7,58,198 నగదు విత్‌డ్రా చేశాడని చెప్పారు. బ్యాంకు నుంచి తన ఫోన్‌కు మెస్సేజ్ రావడంతో పంచాయతీ కార్యదర్శిని అడిగితే సమాదానం ఇవ్వకుండా.. తనను పరుష పదజాలంతో దూషించాడని చెప్పారు. ఎస్సీ కాలనీలో డ్రెయినేజీల నిర్మాణం పూర్తిచేసినా.. పంచాయతీ కార్యదర్శి తనకు బిల్లులు చేయకుండా ఇబ్బందులు పెడుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై జిల్లా కలెక్టర్, జేసీకి కూడా ఫిర్యాదు చేశామన్నారు. అక్రమ బిల్లులపై పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకుని, రూ.15 లక్షలు బిల్లులను వెంటనే ఇప్పించాలని సర్పంచ్ కోరారు. ఎంపీడీవో సీతారామయ్యను వివరణ కోరగా తన వద్ద ఎటువంటి సమాచారం లేదన్నారు.

పాపం ఆదాయం లేక.. పరిహారం రాక



మునగతోటలో అంతరపంటగా సాగు చేస్తున్న బంతిపూలు

వినుకొండటౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అధికారుల సూచనల మేరకు పూల తోటలపై అధిక లాభాలతో సంతోషంగా ఉండాలన్న రైతుకు చివరకు కన్నీరే మిగిలింది. ప్రకాశం జిల్లా గొర్రెపాడు ప్రాంతం నుంచి వ్యవసాయం కోసం వినుకొండలో స్థిరపడిన రైతు ఆదాం పట్టణంలోని మసీదు మాన్యం సమీపంలో రెండెకరాలు కౌలుకు తీసుకున్నాడు. అర ఎకరా విస్తీర్ణంలోని మునగ పంట వేశారు. దాంతో పాటు అంతర్ పంటగా మొక్క రూ.3 చొప్పున ఎకరాకు 1,400 బంతి మొక్కలను రెండెకరాల్లో నాటారు. ఇటీవల కురిసిన మొంథా తుపాను ధాటికి పూలన్నీ వాడిపోయాయి. సుమారు ఎకరా బంతిపూలను తొలగించాల్సి వచ్చింది. మిగిలిన తోటలోని పూలకు మచ్చరావడంతో సుమారు రూ.1.70లక్షల మేరకు నష్టం వాటిల్లిందని రైతు లబోదిబోమంటున్నారు. పంట నష్టపరిహారం కోసం ప్రయత్నిద్దామన్నా .. కౌలు సాగు కావడంతో.. యజమానుల సహకారం లేదని ఆదాం వాపోయారు.



రెండు రకాల బంతిపూల తోట



విజేత కృష్ణవేణి డిగ్రీ కళాశాల జట్టును అభినందిస్తున్న ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు, ముఖ్యఅతిథి జీ సూర్యనారాయణ రావు తదితరులు



రన్నర్‌గా నిలిచిన యూనిర్సిటీ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ జట్టును అభినందిస్తున్న అతిథులు

ఉత్కంఠ పోరులో విజేత కృష్ణవేణి

● ముగిసిన ఏఎన్‌యూ అంతర కళాశాలల వాలీబాల్ పోటీలు

నరసరావుపేట టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట లోని కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం అంతర కళాశాలల వాలీబాల్ టోర్నమెంట్ గురువారం విజయవంతంగా ముగిసింది. ఉత్కంఠ భరితంగా జరిగిన ఈ పోటీలో కృష్ణవేణి డిగ్రీ కళాశాల జట్టు విజేతగా నిలిచింది. రన్నర్‌గా వర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ జట్టు నిలిచింది. మొదటి రెండు సెట్లలో 27-25, 26-24 పాయింట్లతో కృష్ణవేణి కళాశాల జట్టు ఆధిపత్యం ప్రదర్శించగా.. మూడో సెట్‌లో 22-25లో యూనివర్సిటీ ఎడ్యుకేషన్ జట్టు లైవ్‌లోకి వచ్చింది. అయితే ఏకపక్షంగా సాగిన నాలుగు సెట్‌లో 25-13 తేడాతో కృష్ణవేణి డిగ్రీ కళాశాల జట్టు విజయం సాధించడంతో విజేతగా నిలిచింది. మూడవ స్థానానికి జరిగిన పోటీలో ధనలక్ష్మి ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజ్‌పై బాపట్ల ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ విజయం సాధించింది. ఈ సందర్భంగా జరిగిన బహుమతుల ప్రదానోత్సవం కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ క్రీడాకారుల్లో కనిపించిన స్ఫూర్తి, క్రమశిక్షణ అభినందనీయం అన్నారు. ముఖ్య అతిథి ఏఎన్‌యూ యోగా కోఆర్డినేటర్ బి.సూర్యనారాయణరావు మాట్లాడుతూ క్రీడలు యువత భవిష్యత్తును తీర్చిదిద్దడానికి సహకరిస్తాయన్నారు. క్రీడలు శారీరక, మానసిక వికాసానికి ఎంతో ఉపయోగ పడతాయన్నారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ ఈదర ఆదిబాబు మాట్లాడుతూ కృష్ణవేణి డిగ్రీ కళాశాల విజేతగా నిలచి, యూనివర్శిటీ టోర్నమెంట్‌లో హ్యాట్రిక్ సాధించిందన్నారు. డైరెక్టర్ కే.నాసరయ్య, డాక్టర్ సీహెచ్ వెంకటరావు, డాక్టర్ గౌరీ శంకర్, డాక్టర్ పి. శ్రీనివాసరావు, అమ్మయ్య చౌదరి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సతీష్‌బాబు, మహమ్మద్ పాల్గొన్నారు.

మాట నిలుపుకున్నాం

ఇక అభివృద్ధిపై దృష్టి పెట్టండి

ఎమ్మెల్యేలు కందుల, అశోక్‌లతో సీఎం

(ఒంగోలు, ఆంధ్రజ్యోతి)

'ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మార్కాపురం జిల్లా ఏర్పాటు చేస్తామని ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నాం. మీ వంతుగా జిల్లా అభివృద్ధిలో కీలక బాధ్యత పోషించి రాజకీయంగా పార్టీ బలోపేతం అయ్యేందుకు కృషి చేయండి' అని సీఎం చంద్రబాబు మార్కాపురం, గిద్దలూరు ఎమ్మెల్యేలు కందుల నారాయణరెడ్డి, ముత్తుముల అశోక్‌రెడ్డిలకు సూచించారు. గురువారం మధ్యాహ్నం సచివాలయంలో ముఖ్యమంత్రిని ఇద్దరు ఎమ్మెల్యేలు కలిశారు. మార్కాపురం జిల్లా ఏర్పాటు చేయటం పట్ల ధన్యవాదాలు తెలిపారు. గిద్దలూరు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి గిద్దలూరు నియోజకవర్గాన్ని మార్కాపురం డివిజన్‌లో ఉంచటం పట్ల ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆ సందర్భంగా చంద్రబాబు వారితో మాట్లాడుతూ 'ప్రజలకు మనమిచ్చిన అన్ని హామీలనూ నెరవేర్చుతున్నాం. వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేస్తాం. మీరు ప్రజలతో మరింత చేరువగా ఉండి పార్టీని కూడా బలోపేతం చేయండి' అని సూచించారు. పాలనా, పార్టీ వ్యవహారాల విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించినా సహించేది లేదని కూడా హెచ్చరించారు.

30న బాలుర క్రికెట్ జట్టు ఎంపిక

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం ఉమ్మడి జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా అండర్-12 బాలుర క్రికెట్ జట్టు ఎం పిక పోటీలు నిర్వహిస్తున్నట్లు పీడీసీఏ కార్యదర్శి కారుసాల నాగేశ్వరరావు గు రువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 30వ తేదీన ఆదివారం ఉదయం 9 గంటలకు ఒంగోలు నగరం మంగమూరు రోడ్‌లో గల అసోసియేషన్ సబ్ సెం టర్‌లో ఎంపిక పోటీలు జరుగుతాయన్నారు. హాజరయ్యే క్రీడాకారులు వైట్ డ్రస్, షూ, సొంత కిట్‌తో పాటు జనన ధృవీకరణ పత్రం, ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్‌తో హాజరుకావాలని కోరారు. ఆసక్తి గల క్రీడాకారులు కె.సుధాకర్ 9701022333, బి.చంద్రశేఖర్ 9246222999 సెల్ నంబర్లు ద్వారా పూర్తి వివరా లను తెలుసుకోవచ్చన్నారు.

ఉద్యోగోన్నతుల ఉపవర్గీకరణపై హర్షం

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్ కులాల ఉద్యో గుల ఉద్యోగోన్నతులను ఉపవర్గీకరణ చేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేయడం పట్ల మాదిగ సంక్షేమ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు సుజన్ మాదిగ హర్షం వ్యక్తంచేశారు. ఒంగోలులోని సమితి కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసి న విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో చెప్పిన విధంగానే ఎస్సీ రిజర్వేషన్లను ఏబీసీ గ్రూపులుగా వర్గీకరించిందని చెప్పారు. దీని ద్వారా విద్య, ఉద్యోగ,ఉపాధి అవకాశాల్లో జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు అమలు జరుగుతాయన్నారు. దీంతో పాటు షెడ్యూల్‌కు లాల ఉద్యోగుల ఉద్యోగోన్నతుల కూడా ఉపవర్గీకరణ చేపడతామని జీవో జారీ చేయడం అభినందనీయమన్నారు. సీఎం చంద్రబాబు నాయుడుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో త్యాగరాజు, కె.విజయ్‌కుమార్, తేళ్ళ జయరాజ్, బండారు సురేష్, పొగడ్త నారాయణ, సుబ్బారావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఒంగోలు క్రైం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం ఒంగోలు నగరంలోని పలుప్రాంతాలలో కరెంటు సరఫ రాను నిలిపివేస్తున్నట్లు డీఈ రంగారావు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్థానిక కర్నూల్‌రోడ్డులోని శ్రీనగర్‌కాల నీ, భారత్ పెట్రోల్ బంకు, మారుతీనగర్, అగ్గిలియం స్కూల్, ఎస్‌బీఐ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. వినియోగ దారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

చీమకుర్తి మండలంలో..

చీమకుర్తి: మండలంలోని బూదవాడ, ఆర్ఎల్‌పురం సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు, గ్రానైట్ పరిశ్రమకు విద్యుత్ సరఫరాలో శుక్రవారం అంతరాయం కలుగనుంది. పీఎంఐ పనులు నిర్వహించనున్నందున ఉదయం 7.30 నుంచి 11.30 గంటల వరకు బూదవాడ, ఆర్ఎల్‌పురం, రామతీర్థం ప్రాంతాల్లో పరిశ్రమలకు పులికొండ, మైలవరం, బూసరపల్లి, చినరావిపాడు, మర్రిచెట్లపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డీఏఈ ఆర్.మోహనరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఆదర్శ నేత శేషయ్య

కొండపి, నవంబరు27 (ఆంధ్రజ్యోతి): పెరిదేపి గ్రామానికి చెందిన దివంగత సీపీఎం నాయకుడు ముప్పరాజు శేషయ్య జీవితం ఆదర్శప్రాయమని సీపీఎం సీనియర్ నాయకుడు ముప్పరాజు కోటయ్య అన్నారు. గురువారం పెరిదేపిలో జరిగిన దివంగత సీపీఎం నాయకుడు శేషయ్య 26వ వర్ధంతి కార్యక్రమం ని ర్వహించారు. సీపీఎం జిల్లా నాయకుడు కేజీ మస్తాన్ మాట్లాడుతూ పీడితుల పక్షాన శేషయ్య పోరాడి విజయాలు సాధించారన్నారు. కార్యక్రమంలో ప్రజా నాట్యమండలి కళాకారులు, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన టీచర్ సస్పెన్షన్

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన స్కూలు అసిస్టెంట్(తెలుగు) ఉపాధ్యాయుడు బక్కమంతుల వినయ్‌కుమార్ సస్పెన్షన్ చేస్తూ గురువారం రాత్రి డీఈవో కిరణ్ కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. నాగులుప్పలపాడు మండలం హెచ్.నిడమానూరు జడ్పీ హైస్కూలు ప్లస్‌లో ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న వినయ్‌కుమార్ విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంతో బుధవారం వారి తల్లిదండ్రులు దాడి చేసిన విషయం విదితమే. దీనిపై స్పందించిన కలెక్టర్ రాజాబాబు సమగ్ర విచారణకు ఆదేశించడంతో విద్యాశాఖాధికారులు విచారణ చేపట్టారు. వెంటనే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించడంతో వినయ్‌కుమార్‌ను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

ఉపాధ్యాయుడి అసభ్య ప్రవర్తనపై విచారణ

నాగులుప్పలపాడు: కళాశాల విద్యార్థినుల పట్ల ఉపాధ్యాయుడు బక్కమంతల వినయ్‌కుమార్ అసభ్యంగా ప్రవర్తించినట్లు తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు హెచ్ఎం లింగంగుంట శ్రీనివాసరావు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో బి.నిడమానూరు హైస్కూల్‌లో డిప్యూటీ డీఈవో చంద్రమౌళేశ్వరరావు, బాలికలు, చిన్నారుల అభివృద్ధి అధికారి హేమలత గురువారం విచారణ చేపట్టారు. పాఠశాలలోని ఉపాధ్యాయులు, విద్యార్థులను విడివిడిగా విచారించారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందించనున్నటు వారు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవోలు తిరుమలశెట్టి రవి, ఈవీ రమణయ్య పాల్గొన్నారు.

వెటర్నరీ పదం వాడకూడదని మాట్లాడటం బాధాకరం

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పశువైద్య విద్యలో డిగ్రీ లేకుండా వెటర్నరీ పదం వాడకూడదని రాష్ట్ర వెటర్నరీ కౌన్సిల్ ఛైర్మన్ డాక్టర్ పీవీ లక్ష్మయ్య మాట్లాడటాన్ని రాష్ట్ర పశుసంవవర్ధకశాఖ నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నేరియన్స్ ఫెడరేషన్, జిల్లా శాఖ వీఏ, ఎల్ఎఎస్, జేవీవో అండ్ వీఎల్‌వో కార్యవర్గ సభ్యులు ఖండించారు. గురువారం ఆ మేరకు పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ ఎన్.వెంకటేశ్వరరావుకు ఏపీఎన్‌జీవీవో ఛైర్మన్ టీవీ రమేష్‌బాబు ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర పశుసంవర్ధకశాఖ పారా వెటర్నేరియన్స్‌కు, అధికారుల మధ్య లేనిపోని అపోహలు, వివాదాలకు తావిస్తూ గందరగోళానికి గురి చేస్తున్న పీవీ లక్ష్మయ్యను ఆ పదవిని నుంచి వెంటనే తొలగించాలని ఫెడరేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ కో ఛైర్మన్ కే శంకరరావు, కార్యవర్గ సభ్యులు ఎం. కోటేశ్వరరావు, పీ. శ్రీనివాసరావు, బి. ప్రభావతి, తులశమ్మ, సుశీల, శాంతకుమారి, పీ వెంకటేశ్వర్లు, ఎం.అంకమ్మ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



పశుసంవర్ధకశాఖ అధికారి వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేస్తున్న ఫెడరేషన్ నాయకులు

ప్రజలను మోసం చేస్తున్న కేంద్రం

ఏఐసీసీ కార్యదర్శి జావేద్

ఒంగోలు క్రైం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి) : భారతదేశం కోసం అంబేద్కర్ అందించిన రాజ్యాంగంలోని హక్కులను ఉల్లంఘిస్తూ పేదప్రజలపై పన్నుల భారం మోపి కేంద్ర ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని ఏఐసీసీ కార్యదర్శి నదీమ్ జావేద్ విమర్శించారు. గురువారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణంపై జరిగిన సమావేశానికి డీసీసీ అధ్యక్షుడు షేక్ సైదా అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జావేద్ మాట్లాడుతూ టీడీపీ బీజేపీతో పొత్తుపెట్టుకొని ప్రశాంత రాష్ట్రంలో మతం పేరుతో చిచ్చు పెడుతున్నాయని మండిపడ్డారు. అభివృద్ధి, సంక్షేమాన్ని గాలికి వదిలివేసి చంద్రబాబునాయుడు, జగన్‌మోహన్‌రెడ్డిలు ఇరువురు నరేంద్ర మోదీతో అంటకాగుతూ వ్యవస్థలను నిర్వీరం చేస్తున్నారన్నారు. పేద ప్రజలకు అండగా ఎప్పుడూ కాంగ్రెస్ పార్టీ ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పరిశీలకులు జాన్‌బాబు, బీవై కిరణ్, మేకల సతీష్, వివిధ నియోజకవర్గాల కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నదీమ్‌జావేద్, పక్కన సైదా తదితరులు

లారీని ఢీ కొన్న మోటర్ సైకిల్

యువకుడు మృతి

మేదరమెట్ల, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మేదరమెట్ల బైపాస్‌లో లారీ వెనుక చక్రాన్ని మోటర్ సైకిల్ ఢీకొన్న ఘటన యువకుడు మృతి చెందాడు. గురువారం సాయంత్రం ఒంగోలు వైపు నుంచి గుంటూరు వైపు వెళుతున్న మోటర్ సైకిల్ లారీని దాటి ముందుకు వెళ్లే క్రమంలో లారీ వెనుక చక్రాన్ని ఢీ కొట్టింది. దీంతో మోటర్ సైకిల్ వెనుక ఉన్న వ్యక్తి కింద పడ్డాడు. కిందపడిన వ్యక్తిపైగా లారీ వెళ్లడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని చెవులకు ఇయర్ ఫోన్స్ ఉన్నాయి. ఘటన స్థలంలో ఫోన్ లభించలేదని ఘటన స్థలాన్ని పరిశీలించిన మేదరమెట్ల ఎస్ఐ మహమ్మద్ రఫీ తెలిపారు. సంఘటన జరిగిన వెంటనే ఆపకుండా వెళ్లిన లారీని మేదరమెట్ల ఎస్ఐ వెంబడించి పట్టుకున్నారు. లారీ డ్రైవర్ జిల్లెల వరుణ్‌కుమార్‌గా గుర్తించారు. ప్రమాదం జరిగిన తరువాత మోటర్ సైకిల్ నడుపుతున్న వ్యక్తి అ క్కడ నుంచి పరారయ్యాడు. దీంతో మృతి చెందిన వ్యక్తి వివరాలు తెలియరాలేదు. మేదరమెట్ల ఎస్ఐ మహమ్మద్ రఫీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జిల్లా కలెక్టర్ కార్యాలయంలో

మరో లిఫ్ట్ అందుబాటులోకి..

- **దివ్యాంగుల సంక్షేమశాఖ నుంచి రూ.47లక్షలు**

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిపాలన భవన్ (జిల్లా కలెక్టరేట్)కు మరో లిఫ్ట్ అందుబాటులోకి రానుంది. ఒకేసారి లిఫ్ట్‌ను 13 మంది వినియోగించుకునేలా రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ.స్వామి చర్యలు తీసుకున్నారు. అందుకోసం దివ్యాంగుల సంక్షేమశాఖ నుంచి రూ.47లక్షలను మంజూరు చేశారు. లిఫ్ట్ సౌకర్యం కోసం మొదటి విడత గా రూ.23.5లక్షలను విడుదల చేశారు. వివిధ పనుల కోసం ప్రకాశం భవన్‌కు వచ్చే ప్రజలకు ఉపయోగపడేలా ఈ నిధులతో పనులను త్వరగా చేపట్టేలా చ ర్యలు తీసుకోవాలని మంత్రి స్వామి కలెక్టర్ రాజాబాబుకు సూచించారు. దివ్యాంగులకు ప్రత్యేక టాయిలెట్లు, లిఫ్ట్ సౌకర్యాన్ని కల్పించేలా నిధులు విడుదల చేసి న మంత్రి స్వామికి జిల్లా యంత్రాంగం కృతజ్ఞతలు తెలిపారు. కాగా ఇప్పటికే ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి తన ఎంపీ ల్యాడ్స్ నుంచి నిధులు మంజూరు చేయడంతో కలెక్టరేట్‌లో లిఫ్ట్ ఏర్పాటుకు పనులు జరుగుతున్న విషయం తెలిసిందే. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కలెక్టరేట్‌కు పూర్తి స్థాయి లో సౌకర్యాలు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు శెగ్గం శ్రీనివాసులు తెలిపారు. బీజేపీ ఆధ్వర్యంలో గురువారం ఒంగోలులో జిల్లా మీడియా కన్వీనర్ ధనిశెట్టి రాము ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ పథకాలపై ఇంటింటికి, షాపులకు స్టిక్కర్ల అంటించే కార్యక్రమాన్ని చేపట్టారు. ముందుగా అంకమ్మతల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నగరంలోని పలు ప్రాంతాల్లో ఇంటింటికి తిరిగి కేం ద్ర ప్రభుత్వ పథకాలను వివరించి స్టిక్కర్లను అంటించే కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశ ప్రజల ఆర్థిక అభివృద్ధికి, దేశ రక్షణకు అమలు చేస్తున్న పథకాలను వివరించారు. కేంద్రం అమలు చేస్తున్న పీఎం విశ్వకర్మ యోజన. అమృత్ భారత్ స్టేషన్, అగ్నివీర్, గరీబ్ కళ్యాణ్ రోజ్ గార్‌యోజన, అవాస్, అటల్‌పెన్షన్, సురక్ష యోజన తదితర పథకాలను వివరించారు. కార్యక్ర మంలో బీజేపీ నాయకులు రాయపాటి అజయ్‌కుమార్, మాకినేని అమరసిం హం, భగత్‌వినోద్, సంగోతు వర్మ, తీగల సత్యవతి, తమ్మిశెట్టి లక్ష్మి పాల్గొన్నారు.



స్టిక్కర్లను అందజేస్తున్న బీజేపీ నాయకులు

ఘనంగా అభయాంజనేయస్వామి కల్యాణం

పర్చూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు వైజంక్షన్‌లోని 92 అడుగుల శ్రీ అభయాంజనేయ స్వామివార్ల ఆలయంలో గురువారం శ్రీ సీతారాములవారి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామివార్ల వేడుకలను వీక్షించేందుకు పెద్దఎత్తున ఆయా గ్రామాల నుండి భక్తులు తరలి వచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణంలో సందడి వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా ఆలయంలో తొలుత అర్చకుల సారథ్యంలో పూజాకార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామి వారికి కల్యాణం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. స్వామివార్ల కల్యాణ వేడుకల సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

అయ్యప్ప మాలతో ఏకాగ్రత సాధ్యం

అక్కయ్యపాలెం(చీరాల) : నిష్టతో అయ్యప్పమాల ధరించడం వలన మానసిక ఏకాగ్రత సాధ్యమని ఎమ్మెల్యే కొండయ్య పేర్కొన్నారు. వేటపాలెం మండలం అక్కయ్యపాలెం గ్రామంలో మాలదారులు నిర్వహిస్తున్న ప్రత్యేక పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈసందర్భంగా అందరితో కలిసి పూజలు నిర్వహించి స్వామిని స్మరించారు. ఆయన వెంట పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



విద్యుత్ దీపాల అలంకరణలో ఆలయం



పూజలు నిర్వహిస్తున్న భక్తులు



అయ్యప్ప పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కొండయ్య

పుడమి తల్లి రుణం తీర్చుకోవాలి

(3వ పేజీ తరువాయి)

ఎమ్మెల్యేలు ఇప్పుడు దారి తప్పుతున్నారని, వారు చెబితేనే ఏ పనైనే చేసేందుకు అధికారులు అలవాటు పడ్డారని, ఇటువంటి పరిస్థితుల్లో పేదలకు సంక్షేమం అందటం కష్టమవుతుందన్నారు. అమ్మ భాషను మర్చిపోయినవాడు అసలు మనిషే కాదన్నారు. సాటి మనిషికి సేవ చేయడం గొప్ప భాగ్యమని, దీనికి దుర్గా కమేశ్వరరావు ఒక ఆధునిక రుషిలా పాటుపడ్డారని కొనియాడారు. నేటి ప్రభుత్వాలు చేపలు పట్టడం నేర్పటం కాకుండా, ఏకంగా చేపలనే అందిస్తున్నారని, దీనివల్ల మనిషిలో నిపుణత తగ్గిపోతుందన్నారు. సోమరితనం పెరిగిపోయి దేశ భవిష్యత్తుకు ప్రమాదకరంగా మారుతుందన్నారు.

అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ దేశ విదేశాల్లో తెలుగు కీర్తిని పెంచిన వ్యక్తి వెంకయ్యనాయుడని, ఆయనను మాజీ ఉపరాష్ట్రపతి అంటే సరిపోదని, అపూర్వ ఉపరాష్ట్రపతి అని పిలవడం సముచితమన్నారు. తెలుగు రాష్ట్రాల ప్రతిష్ఠను వెంకయ్యనాయుడు పెంచితే, సేవకు ప్రతిరూపంగా డాక్టర్ పీడీకే రావ్‌ను చెప్పుకోవచ్చన్నారు. సేవకుడిగా, పేదల పాలిట పెన్నిధిగా నిలిచిన కామేశ్వరరావు వంటి సేవా శిఖరాన్ని సత్కరించుకోవడం గొప్ప విషయమన్నారు. సభకు అధ్యక్షత వహించిన ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మట్లాడుతూ మాతృ దేశం, బాష కోసం పాటుపడే గొప్ప వ్యక్తి వెంకయ్యనాయుడు అయితే, పేదలకోసం పాటుపడటంలో ఒక వ్యక్తే మహోన్నత శక్తి అవుతుందన్న విషయాన్ని నిరూపించిన మహామనిషిగా కామేశ్వరరావు నిలుస్తారన్నారు. అటువంటి గొప్ప వ్యక్తికి తెనాలిలో పురస్కారం అందించుకోవడం గొప్ప భాగ్యంగా భావిస్తున్ననన్నారు. అవార్డు గ్రహీత కామేశ్వరావు మాట్లాడుతూ తను ఇంతటి పురస్కారానికి అర్హుడినో! కాదో కానీ, తనకు నచ్చిన పని నేను చేసుకు వెళ్లానని, అది అందరికీ గొప్ప విషయంగా కనిపించడం గర్వంగా ఉదన్నారు. చీపురుపల్లి వంటి మారుమూల గ్రామాల్లో వెనుకబడిన వారు ఎదుర్కొంటున్న సమ్యలు, పేదరికం వంటివాటిపై తనవంతు సేవ చేశానన్నారు. సేవ చేసేటప్పుడు కూడా బెదిరింపులు, కేసులు తప్పలేదని, అన్నిటికీ తట్టుకుని తాను ఎంచుకున్న మార్గంలోనే నడిచానన్నారు. తన సేవలను గుర్తించి పురస్కారం ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. తన 84 ఏళ్ల జీవితంలో ఇది మరిచిపోలేని రోజన్నారు. సభలో హైకోర్టు న్యాయవాది ఇంద్రనీల్, రోటరీక్లబ్ అధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వరరావులు ప్రసంగించారు. ఓలేటి పార్వతీశం పరిచయ కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమంలో కుమార్ పంప్స్ అధినేత కొత్త సుబ్రహ్మణ్యం, డబుల్ హార్స్ మినపగుళ్ల పరిశ్రమ అధినేత మునగాల మోహన్ శ్యాంప్రసాద్, చిత్రకారుడు గిరిధర్ పాల్గొన్నారు.

నానో యూరియా

(3వ పేజీ తరువాయి)

అమ్మకాల బాధ్యతను డీసీఎంఎస్, మార్కుఫెడ్‌కు అప్పగించింది. ప్రస్తుతం జిల్లాలకు వస్తున్న యూరియా నిల్వల్లో 70 శాతం డీసీఎంఎస్, సొసైటీ లకు, 30 శాతం ప్రైవేట్ డీలర్లకు కేటాయిస్తున్నారు.

అక్కడ కూడా అదే గోల

డీసీఎంఎస్, సొసైటీల ద్వారా యూరియా అమ్మకాలు జరుపుతున్నప్పటికీ నానో యూరియా బాధలు రైతులకు తప్పడం లేదు. గత ఖరీఫ్ సీజన్‌లో మూడు బస్తాలు యూరియా తీసుకుంటే ఒక లీటర్ నానో యూరియా తీసుకోవాలని ముడిపెట్టారు. రబీలో కూడా అదే పరిస్థితి కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. రానురాను ఘన యూరియా వాడకం తగ్గించి రైతులను ద్రవ నానో యూరియా వైపునకు మళ్లించాలని కేంద్రం ఆలోచిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. అయితే రైతులు మాత్రం నానో యూరియా వాడేందుకు పెద్దగా ఆసక్తి చూపించకపోవడంతో దాని కొనుగోలు వారికి భారంగా మారింది. ఒక వేళ నానో యూరియా తీసుకోకుంటే యూరియా ఇవ్వమని రైతుల ముఖం మీదే చెబుతున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు.

రూ. 250 వృథానే

నానో ఎరువులు తీసుకోకుంటే యూరియా ఇవ్వరన్న ఆలోచన తో రైతులు అవసరం ఉన్నా.. లేకున్నా కొనుగోలు చేస్తున్నట్లు చెబుతున్నారు. మూడు యూరియా బస్తాల కోసం రూ.799.50 వెచ్చిస్తే, నానో యూరియా కోసం రూ. 250 వరకు చెల్లిస్తున్నారు. నానో ఎరువులను బలవంతంగా కొన్నా.. వాడటం లేదని రైతులు చెబుతున్నారు. ఈ విషయం పై అధికారులు దృష్టి సారించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

శ్రీవారి చిత్తంతోనే.. అమరావతి

(3వ పేజీ తరువాయి)

చేస్తున్నామని చెప్పారు. అమరావతినే కాకుండా, ఈ ప్రాంతాన్ని కాపాడే శక్తి ఈ దేవాలయానికి ఉందన్నారు. గత ప్రభుత్వం విధ్వంసం తప్ప మంచి చేసిన సందర్భాలు లేవని, మంచి సంకల్పంతో రైతులు భూములు ఇస్తే నరకాన్ని చూపించారన్నారు. రైతులు వేంకటేశ్వరస్వామిని నమ్ముకుని న్యాయస్థానం నుంచి దేవస్థానం వరకు యాత్ర చేసి రాజధానిని కాపాడుకోవడానికి పోరాడారన్నారు. కార్యక్రమం లో మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరి నారా యణ, నాదెండ్ల మనోహర్, టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, సభ్యులు జానకీదేవి, భానుప్రకాశ్, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, పెద్ద సంఖ్యలో రాజధానిప్రాంత రైతులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.


యూటీఎఫ్ నూతన కార్యవర్గ ఎన్నిక



ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన కమిటీ

పంగులూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): జె.పంగులూరు మండల యూటీఎఫ్ నూతన కార్యవర్గ ఎన్నిక గురువారం సాయంత్రం పంగులూరులో నిర్వహించారు. యూటీఎఫ్ మండలశాఖ గౌరవాధ్యక్షుడిగా కోటేశ్వరనాయక్, నూతన అధ్యక్షుడిగా బి.రవిచంద్రబాబు, ప్రధాన కార్యదర్శిగా దామా రామాంజనేయులు, ఉపాధ్యక్షుడిగా బి.సుబ్బారావు, మేరీ శ్యామల, కోశాధి కారిగా షేక్ ఫిరోజ్‌సాహెబ్ ఎన్నికయ్యారు. రాష్ట్రకౌన్సిలర్లుగా కె.సాయి సత్యనారాయణ, ఎస్వీ డి.ప్రసాద్, ఎస్ఎల్ఎన్.సత్యనారాయణ, ఎం.రమాదేవి, రావి శ్రీనివాసరావులు ఏకగ్రీవగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఉప్పత చెంచయ్య, ఎన్నికల అధికారిగా పాలపర్తి రామాంజ నేయులు, ఆడిట్‌కమిటీ సభ్యులు జగన్నాథం బాబూరావు, పూనాటి హరిబాబు హాజరయ్యారు.

పాఠశాలకు కంప్యూటర్ బహూకరణ



కంప్యూటర్‌ను అందజేస్తున్న దాతలు

బల్లికురవ, నవంబరు27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముక్తేశ్వరం ఉన్నత పాఠశాలకు అదే పాఠశాలలో గతంలో పనిచేసిన దివంగత కారసాని అంజిరెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారుడు వెంకటపోలిరెడ్డి, ఆయన అల్లుడు చంటి వెంకటరెడ్డిలు గురువారం కంప్యూటర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు దాతలు ముందుకు వచ్చిన సహకారం అందించడం అభినందనీయన్నారు. విద్యార్థులు కూడా దాతలు అందజేసిన కంప్యూటర్‌ను సద్వినియెగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం సురేష్, గ్రామ పెద్దలు కొండేటి ఇజ్రాయల్, అట్లూరి నాగేశ్వరరావు, సింగంశెట్టి సుబ్బారావు పాల్గొన్నారు.

రేపు మున్సిపల్ సమావేశం

అద్దంకి,నవంబరు27(ఆంధ్రజ్యోతి):అద్దంకి మున్సిపల్ సాధారణ సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు ఛైర్‌పర్సన్ ఎస్తేరమ్మ అధ్యక్షతన జరుగుతుందని మున్సిపల్ కమీషనర్ రవీంద్ర తెలిపారు. మొత్తం 18 అంశాల అజెండా తో సమావేశం నిర్వహిం చనున్నట్లు తెలిపారు.

అవీ..ఇవీ..

అకడమిక్ ఫోరం అధికారుల తనిఖీ

మార్టూరు, నవంబరు27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలలపూడి, తాటివారిపాలెం గ్రామాలలోని ప్రాథమిక పాఠశాలలను గురువారం మండల అకాడమిక్ ఫోరం అధికారులు తనిఖీ చేశారు. వారు పాఠశాలలోని వసతులను, విద్యాప్రమాణాలను, పాఠశాల రికార్డులను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో విద్యార్థులకు బోధించే బోధనానైపుణ్యాలను వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ నివేదికను ఉన్నత అధికారులకు పంపిస్తామని వారు ఉపాధ్యాయులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు వస్రామ్‌నాయక్, కే.ప్రేమలత, కాంప్లెక్స్ చైర్మన్ కృష్ణప్రసాద్, ప్రధానోపాధ్యాయులు ఐ.ఏకాంబరం, కే.కరుణాకర్ వీ.వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఫిర్యాదుపై వ్యక్తిపై కేసు నమోదు

మార్టూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అర్ధరాత్రి ఇంటిలోకి ప్రవేశించి తనపట్ల అసభ్యకరంగా ప్రవర్తించి, గాయపరచారని మండలంలోని ద్రోణాదుల గ్రామానికి చెందిన ఓ మహిళ, అదే గ్రామానికి చెందిన తాళ్లూరి వెంకట్రావు అనే వ్యక్తిపై గురువారం స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ నెల 20న ఘటన చోటుచేసుకోగా ఆమె ఫిర్యాదు మేరకు వెంకట్రావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సైదా తెలిపారు.

ప్లాస్టిక్ నిషేధాన్ని ఆచరిద్దాం

● మున్సిపల్ చైర్మన్ సాంబశివరావు



స్టీలు సీసాలను అందజేస్తున్న చైర్మన్ శ్రీనివాసరావు

చీరాల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ప్లాస్టిక్ నియంత్రణ ముందుగా మన నుంచే ప్రారంభం కావాలని మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు అధికారులకు, సిబ్బందికి చెప్పారు. ఈ క్రమంలోనే అందరికీ స్టీల్‌వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. గురువారం కార్యాలయం సమావేశం హాలులో 'సచ్చాంధ్ర కార్పొరేషన్ ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ సంస్థ' ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ప్లాస్టిక్ రహిత చీరాలగా మార్చాలంటే, ఆచరణ ముందుగా మనలోనే ఉండాలన్నారు. మున్సిపల్ శాఖకు సంబంధించిన ఉద్యోగులు ప్లాస్టిక్‌కు దూరంగా ఉండాలన్నారు. అందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మేనేజర్ శ్రీనివాసరావు, టీపీవో కే.శ్రీనివాసులు, ఏఈ రవికుమార్, గీత తదితర ఉద్యోగులు పాల్గొన్నారు.

రేకులషెడ్డుపైకి దూసుకొచ్చిన లారీ

● కొడవళ్ల తయారీ కర్మాగారం ధ్వంసం

● రాత్రి సమయం కావడంతో తప్పిన పెను ప్రమాదం



ధ్వంసమైన రేకులషెడ్డు

బల్లికురవ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రహదారి అంచులో ఉన్న రేకులషెడ్డు పైకి లారీ దూసుకొచ్చిన ఘటన మండల పరిధిలోని అద్దంకి నార్కెట్‌పల్లి రాష్ట్రీయ రహదారి కొప్పెరపాడు గ్రామం వద్ద గురువారం తెల్లవారుజామున చోటుచేసుకొంది. ఈ ప్రమాదంలో రేకులషెడ్డులోని కొడవళ్ల తయారీ కర్మాగారం ధ్వంసం అయ్యింది. హైదరాబాద్ నుంచి ఒంగోలు వైపు వెళుతున్న లారీ డ్రైవర్ నిద్ర మత్తులో మలుపులో రేకులషెడ్డులోని దూసుకొచ్చింది. రాత్రి సమయం కావడంతో ఎవరు అక్కడ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది అని ప్రజలు అంటున్నారు.

డిప్యూటీ ఎంపీడీవోగా సునీత బాధ్యతలు

అద్దంకిటౌన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలో డిప్యూటీ ఎంపీడీవో(జీఎస్‌డబ్ల్యూఎస్)గా బీసునీత గురువారం బాధ్యతలు చేపట్టారు. గుంటూరు జిల్లా పొన్నూరు మండలం బ్రాహ్మణ కోడూరు పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న ఆమె పదోన్నతిపై అద్దంకి వచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వరూధినికి నియమక పత్రాన్ని ఆమె అందజేశారు. ఈ సందర్భంగా సునీతను సిబ్బందిని అభినందించారు.

నేడు పి.గుడిపాడులో మంత్రి పర్యటన

మేదరమెట్ల, నవంబరు 27 : రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ శుక్రవారం ఉదయం 10 గంటలకు మండలంలోని పి.గుడిపాడులో పర్యటించనున్నారు. మండలంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభిస్తారని మంత్రి కార్యాలయ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు.

రాష్ట్రస్థాయిలో మెరిసిన విద్యార్థులు

● స్కూల్‌గేమ్స్ జాతీయ స్థాయి పోటీలకు పలువురు ఎంపిక ● ఖోఖో, యోగా, కబడ్డీలలో సత్తా

పంగులూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి బాల, బాలికల యోగా పోటీలు ఈనెల 23,24,25, తేదీలలో చందలూరులో నిర్వహించగా, గ్రామంలోని పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు సత్తాచాటారు. వారిని గ్రామస్థులు, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ పోటీలలో అండర్-14లో ట్రెడిషనల్ యోగా పోటీలో నాయపాము శ్రుతి ప్రథమ స్థానం సాధించింది. ఆర్టిస్టిక్ విభాగంలో కుంచాల హెప్సిబ, నాయపాము శ్రుతి, అండర్-14 ఆర్టిస్టిక్ సింగిల్ బాలుర విభాగంలో మద్దిశెట్టి మహేష్‌లు ప్రథమస్థానం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఆర్టిస్టిక్ సింగిల్ పోటీలో ఎస్.భవ్యశ్రీ, ఆర్టిస్టిక్ పెయిర్‌లో ఎస్.రత్నకుమారి, ఎస్.భవ్యశ్రీ, రిథమిక్ పెయిర్‌లో ఎ.లిఖిత, ఎస్.భవ్యశ్రీలు రాష్ట్రస్థాయిలో రెండవ స్థానం సాధించారు. ఈ పోటీలలో జిల్లాకు ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌లో మూడవస్థానం లభించడంలో చందలూరు విద్యార్థులు ప్రతిభచూపారు. వివిధ విభాగాలలో సత్తాచాటి ప్రకాశం జిల్లాకు, గ్రామానికి మంచి పేరుతెచ్చిన పాఠశాల విద్యార్థులను, వారికి శిక్షణ ఇచ్చిన పీడీ ప్రతిమ, సహకరించిన పీడీ మధుమూర్తిలను హెచ్ఎం గిరిజ, గ్రామస్థులు ఉపాధ్యాయులు గురువారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో అభినందించారు.

పంగులూరు : ఎస్‌జీఎఫ్ అండర్ - 17 జాతీయస్థాయి ఖోఖో పోటీలకు పంగులూరు ఉన్నత పాఠశాల విద్యార్థి పేరం వెంకటేశ్వర్లు ఎంపికయ్యారు. ఈ నెల 23 నుంచి 25 వరకు కాకినాడ పట్టణంలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్. రాష్ట్రస్థాయి పోటీలలో ప్రకాశం జట్టు ప్రథమస్థానం సాధించింది. ప్రతిభ చాటిన వెంకటేశ్వర్లుకు జాతీయస్థాయి పోటీలలో పాల్గొనేందుకు రాష్ట్ర జట్టులో స్థానం దక్కింది. ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో జరుగనున్న జాతీయస్థాయి అండర్ 17 ఖోఖో పోటీలలో వెంకటేశ్వర్లు పాల్గొననున్నారు. స్థానిక ఎస్ఆర్ఆర్. ఖోఖో అకాడమీలో శిక్షణ పొందుతున్న పంగులూరు ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థి పేరం వెంకటేశ్వర్లు గతంలో కర్నాటకలో జరిగిన అండర్-14 జూనియర్ జాతీయస్థాయి ఖోఖో పోటీలతో పాటు జార్ఖాండ్‌లో నిర్వహించిన జాతీయస్థాయి ఖోఖో పోటీలలో పాల్గొన్నాడు. ఖోఖో క్రీడాపోటీలలో ప్రతిభ చాటి జాతీయస్థాయికి ఎదిగిన పేరం వెంకటేశ్వర్లును హెచ్ఎం సోమేపల్లి శ్రీనివాసరావు, పీడీ మేకా హరిబాబు, రావి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు అభినదించారు.





యోగాపోటీలలో గెలుపొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు, ఖోఖో పోటీలకు ఎంపికైన వెంకటేశ్వర్లు

చినగంజాం : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి అండర్-14 రాష్ట్ర కబడ్డీ జట్టుకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి గురువారం తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 23, 24, 25 తేదిల్లో మచిలీపట్నంలో జరిగిన పోటీలలో కబడ్డీ పోటీలలో సత్తా సాటి అండర్-14 రాష్ట్ర కబడ్డీ జట్టుకు వేణుగోపాల్‌రెడ్డి ఎంపికైనట్లు హెచ్ఎం తెలిపారు. తర్వలో జరిగే జాతీయస్థాయి కబడ్డీ పోటీల్లో రాష్ట్ర కబడ్డీ జట్టుకు వేణుగోపాల్‌రెడ్డి ప్రాతినిధ్యం వహించనున్నట్లు హెచ్.ఎం తెలిపారు, శిక్షణ ఇచ్చిన పీ.డీ. గంటా అంకమ్మ, వ్యాయామ ఉపాధ్యాయులు జీవి.కృష్ణా రావులను పాఠశాల హెచ్ఎం ఉపాధ్యాయులు, పలువురు గ్రామస్థులు అభినం దించారు.



కబడ్డీ జట్టుకు ఎంపికైన వేణుగోపాలరెడ్డి

ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్‌కు శ్రావణీ



వేటపాలెం(చీరాల), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం బాలికోన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయినీ జరుబులు శ్రావణి ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్‌కు టెక్నికల్ అఫీషియల్‌గా ఎంపికైంది. డిసెంబరు 24, 25 తేదీలలో రాజస్థాన్‌లో ఈ పోటీలు నిర్వహించనున్నారు. అందుకు సంబంధించిన నిర్వాహణ కమిటీ నుంచి గురువారం సమాచారం అందడంతో పాఠశాల ఉపాధ్యాయులు, పలువురు శ్రావణిని ప్రత్యేకంగా అభినందిస్తున్నారు.

ఎన్‌జీవో అసోసియేషన్ ఎన్నికలకు సన్నద్ధం

అద్దంకి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నాన్ గెజిటెడ్, గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అద్దంకి తాలూకా యూనిట్ నూతన కార్యవర్గం ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. డిసెంబర్ 15న నిర్వహించే ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్‌ను అసోసియేషన్ ప్రతినిధులు గురువారం స్థానిక కార్యాలయం వద్ద విడుదల చేశారు. అధ్యక్షుడితో పాటు మొత్తం 16 పదవులకు సంబంధించి నూతన కార్యవర్గం ఎన్నిక నిర్వహించనున్నట్లు ఎన్నికల నిర్వహణ అధికారి శేషుబాబు తెలిపారు. సభ్యుల జాబితాను డిసెంబరు 5న ప్రకటించనున్నట్లు తెలిపారు. 8వ తేది ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు నామినేషన్లు స్వీకరించనున్నట్లు తెలిపారు. 9వ తేదీ ఉపసంహరణకు అవకాశం ఉంటుందన్నారు. 15న అద్దంకిలోని ఎన్‌జీవో హోంలో ఎన్నికలు జరుగుతుందన్నారు. ఎన్నిక ప్రక్రియను చీరాల తాలూకా యూనిట్ ట్రెజరర్ కె.పి.దాసు, జిల్లా అడహాక్ కమిటీ మెంబర్ రాజేష్‌లు పర్యవేక్షిస్తారన్నారు. కార్య క్రమంలో జిల్లా అడహాక్ కమిటీ చైర్మన్ పి.నాగేశ్వరరావు, కన్వీనర్ బి.ప్రసాదరావు, అద్దంకి తాలూకా యూనిట్ ప్రతినిధులు కిరణ్‌కుమార్, రమేష్, నాగేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నోటిఫికేషన్‌ను ప్రదర్శిస్తున్న సంఘ ప్రతినిధులు

విద్యార్థి స్థాయికి అనుగుణంగా బోధన సాగాలి

● ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి



బోధనోపకరణాలను పరిశీలిస్తున్న ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి

పర్చూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి సామర్థ్యాన్ని పరిగణనలోనికి తీసుకొని విద్యాబోధన చేయాలని ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి అన్నారు. ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం చేసేవిధంగా ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. గురువారం పర్చూరులోని జిల్లా పరిషత్ హైస్కూల్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల నిర్వహణ, విద్యార్థుల హాజరును పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంఈవో శివకోటేశ్వరరావు, ఎంవీ.వెంకట్రామయ్య, హెచ్ఎం మోదుగుల నాగిరెడ్డి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

వరి నారుమడులు, శనగ పంటల పరిశీలన

చినగంజాం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కడవకుదురు ప్రాంతంలో పోసిన నారుమడులను, గొనసపూడి ప్రాంతంలో శనగ పంటను చీరాల ఏడీఏ రత్నకుమారి, బాపట్ల వరి వ్యవసాయ పరిశోధన కేంద్రం కీటక శాస్త్రవేత్త కామాక్షి, ఏవో ఆర్.చంద్రశేఖర్‌లు గురువారం పరిశీలించారు. కడవకుదురు ప్రాంతంలో పోసిన వరినారుమడుల్లో ఎక్కువగా పొగాకు లద్దె పురుగు తీవ్రస్థాయిలో ఆశించినట్లు గుర్తించినట్లు కీటక శాస్త్రవేత్త కామాక్షి తెలిపారు. వీటి నివారణకు 20 కిలోల తవుడుకు రెండు కిలోల బెల్లం పాకం కలుపుకొని ఉదయాన్నే క్లోరిపైరిపాస్ 500 ఎంఎల్‌తో కలిపి పొలంలో వేయాలన్నారు. కార్యకమంలో కడవకుదురుకు, గొనసపూడి వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ పంటలతో ఆరోగ్యం

చినగంజాం : ప్రకృతి వ్యవసాయంతో పండించిన పంటలు ఆరోగ్యానికి ఎంతో మేలని ప్రకృతి వ్యవసాయ జిల్లా డీపీఎం ఎస్.హెచ్.హాస్సేన్ అన్నారు. మండలంలోని ఎస్ఎంఎస్ఎఫ్ గ్రామామైన కడవకుదురు గ్రామంలో గురువారం నిర్వహించిన 'రైతన్న మీకోసం' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు పాలీక్రాప్ కిట్లు గురించి వివరించారు. గ్రామంలోని డ్వాక్రా మహిళలతో డీపీఎం సమావేశం నిర్వహించి, అనంతరం క్యాడర్ విజయశాంతి సాగు చేస్తున్న కిచెన్ గార్డెన్ గురించి డ్వాక్రా మహిళలకు వివరించారు. కార్యక్రమంలో డీపీఎం ఎన్ఎఫ్ఏ శ్రీవల్లి, మాస్టర్ ట్రైనర్ భారతి, ఇంచార్జ్ జయమ్మ, శ్రీలక్ష్మి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



నారుమడులను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

క్విజ్‌పోటీల విజేతలకు బహుమతులు



విజేతలైన విద్యార్థులతో రోటరీ క్లబ్ ప్రతినిధులు

పంగులూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో రోటరీక్లబ్ ఆఫ్ పంగులూరు వారి ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం మండల స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీలలో రేణంగివరం, కొండమంజులూరు, కోటపాడు ఉన్నత పాఠశాలల విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. గెలుపొందిన విద్యార్థులకు రోటరీ అధ్యక్షుడు డాక్టర్ బత్తుల వీరనారాయణ, కార్యదర్శి రాయిని రామారావులు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. విద్యార్థులలో అభ్యసన స్థాయిని పెంచేందుకు క్లబ్ ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహించినట్లు అధ్యక్షులు డాక్టర్ వీరనారాయణ, రామారావులు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం వడ్లమూడి వేణుబాబు, అజిత్ ట్రస్ట్ చైర్మన్ వి.వీరనారాయణ, తాటి సుబ్బారావు, పేర్ని వీరనారాయణ, పలు పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శింగరకొండ దేవస్థానానికి రిఫ్రిజిరేటర్ అందజేత

అద్దంకి, నవంబరు27 (ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో స్వామి వారి అలంకరణకు వినియోగించే పూలు, పూలదండలు, ఇతర పూజాసామగ్రి నిల్వ ఉంచేందుకు అవసరమైన రూ.34 వేల విలువైన రిఫ్రజిరేటర్‌ను గురువారం హైదరాబాద్‌కు చెందిన మందపాటి పవన్‌కుమార్, అలేఖ్య దంపతులు దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ చుండూరి మురళీ సుధాకార రావుకు అందజేశారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యుడు బత్తుల చంద్రశేఖర్, ఏల్చూరి గోపికృష్ణ, ఆకుల కోటేశ్వరరావు, ప్రధాన అర్చకులు కోట లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



రిఫ్రిజిరేటర్‌ను అందజేస్తున్న దాతలు

లారీ ప్రమాదంలో క్లీనర్ మృతి

● హర్యానా వాసిగా గుర్తింపు



ప్రమాదంలో దెబ్బతిన్న లారీ క్యాబిన్

పంగులూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): లారీ ప్రమాదంలో క్లీనర్ మృతిచెందిన ఘటన మండలంలోని జాగర్లమూడివారిపాలెం సమీపంలో 16వ నంబరు జాతీయ రహదారిపై జీవీ.పాలెంలోని ఓ హోటల్ ఎదురుగా బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకొంది. ఈ ప్రమాదంలో హర్యానా రాష్ట్రానికి చెందిన క్లీనర్ ఆరిఫ్ మృతిచెందాడు. హైవే మొబైల్ సిబ్బంది తెలిపిన సమాచారం మేరకు జాతీయ రహదారిపై ఒంగోలు వైపు కరెంట్‌పోల్స్ లోడుతో వెళుతోంది. లారీని డ్రైవర్ బహిర్భూమికి వెళ్లేందుకు లారీని పక్కన నిలిపాడు. అదే సమయంలో ఆ మార్గంలో వస్తున్న మరో లారీ ఆగి ఉన్న ఈ లారీని వెనక వైపు నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెనుకవైపు లారీలోని క్లీనర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. హైవే అంబులెన్స్ సిబ్బంది క్లీనర్ ఆరిఫ్‌ను చికిత్స నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. క్లీనర్‌చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదానికి సంబంధించి ఎస్ఐ వినోద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. లారీ డ్రైవర్ కుషిద్దుకు ఎలాంటి గాయాలు కాలేదు. మృతిచెందిన లారీ క్లీనర్ హర్యానా రాష్ట్రం, ఓహతికి చెందిన వ్యక్తిగా గుర్తించారు.

ఆర్వో ప్లాటుకు భూమి పూజ



భూమిపూజ చేస్తున్న లక్ష్మి

చినగంజాం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి) : మండలంలోని సంతరావూరు గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఆర్వో ప్లాంటుకు గురువారం భూమిపూజ నిర్వహించారు. పీఏసీఎస్ చైర్‌పర్సన్ యార్లగడ్డ లక్ష్మి భూమిపూజ నిర్వహించారు. ఎంపీ ల్యాండ్స్ నిధులు రూ.9 లక్షలతో ఆర్వో ప్లాంట్ నిర్మాణం చేయనున్నట్లు ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ పి.బసవరాణి తెలిపారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి కె.కృపారావు, టీడీపీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు ఆటలపోటీలు

పంగులూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన పంగులూరు భవిత కేంద్రంలో శిక్షణ పొందు తున్న విభిన్న ప్రతిభావంతులైన బాలబాలికలకు గురువారం పలు క్రీడాపోటీలు నిర్వహించారు. డిసెంబరు 3న విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పరుగుపందెం, మ్యూజికల్ చైర్, హైజంప్ లాంగ్‌జంప్‌తో పాటు జావలిన్‌త్రో పోటీలలో స్థానిక భవితాకేంద్రంలో విద్యనభ్యసిస్తున్న దివ్యాంగ బాలబాలికలు పాల్గొన్నారు. మండల స్థాయిలో గెలుపొందిన దివ్యాంగ బాల, బాలికలు ఈ నెల 29న జిల్లా కేంద్రమైన బాపట్లలో జరిగే పోటీలలో పాల్గొంటారని, భవితాకేంద్ర స్పెషల్ ఎడ్యుకేటర్ భాస్కర మూర్తి తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం. సోమే పల్లి శ్రీనివాసరావు, ఉపాధ్యాయుడు రావి శ్రీనివాసరావు, ఐఈ ఆర్పీలు యోహన్, అరుణ పాల్గొన్నారు.



పరుగుపందెంలో పాల్గొన్న బాలికలు

దివ్యాంగ విద్యార్థులకు ఆటలపోటీలు

ఇంకొల్లు : డిసెంబరు 3న దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా స్థానిక భవిత విద్యావనరుల కేంద్రంలో గురువారం పాఠశాల స్థాయిలో దివ్యాంగ విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారు లు ఎన్.సామ్రాజ్యం, ఏ.శ్రీనివాసరావు పర్యవేక్షణలో రన్నింగ్‌రేస్, మ్యూజికల్ ఛైర్స్, పెయింటింగ్ ఆటల పోటీలు నిర్వహించారు.

ఆర్థర్ కాటన్‌కు ఘన నివాళి



ప్రతిభామూర్తుల చిత్రపటాలకు నివాళ్లులర్పిస్తున్న సభ్యులు

అద్దంకిటౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బ్రిటీష్ వ్యక్తి అయినప్పటికీ, ఆంధ్రప్రాంతానికి అర్థర్ కాటన్ విశేష సేవ చేశారని సృజన అధ్యక్షుడు గాడేపల్లి దివాకర్‌దత్తు అన్నారు. గురువారం సాయంత్రం స్థానిక చిన్ని శాంతయ్య , పిచ్చమ్మ సేవా సదన్‌లో ఆర్‌టీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో 'ప్రతిబా మూర్తులు-మధులస్మృతులు' సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాటన్ కట్టించిన దవళేశ్వరం ప్రాజెక్టు ఆంధ్రరాష్ట్రాన్ని అన్నపూర్ణగా నిలిపిందన్నారు. ఈ సందర్భంగా సర్ అర్థర్ కాటన్, సినీ నటి నిర్మలమ్మల చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళ్లులర్పించారు.విశ్రాంత బ్యాంకు మేనేజర్ తాళ్లూరు బాబురావును సేవారత్న బిరుదుతో సత్కరించారు. పేద మహిళలకు చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కోట అంజమ్మ, వీసీహెచ్ కోటయ్య, ఆర్‌టీసీ డిప్యూటీ సూపరింటెండెంట్ ఎస్‌కె ఖాజావలి, అన్నమనేని వెంకట్రావు, మన్నం త్రిమూర్తులు, రఘురామశర్మ, దేవపాలన, చంద్రమౌళి, మస్తాన్, వీ రయ్య తదితరులు పాల్గొన్నారు.

సంచార కుటుంబాలకు దుప్పట్లు, నూతన వస్త్రాలు పంపిణీ



నూతన వస్త్రాలను అందజేస్తున్న సభ్యులు

అద్దంకిటౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో గురువారం గుండ్లకమ్మ ప్రాంతంలో నివాసం ఉండే సంచార జాతుల కుటుంబాలకు దుప్పట్లు, నూతన వస్త్రాలను పండ్లను పంపిణీ చేశారు. ముద్దబాటి శ్రీను, రోటరీ అధ్యక్షుడు పూర్ణచంద్రరావుల సౌజన్యంతో సంచార కుటుంబాలకు దుప్పట్లు నూతన వస్త్రాలు, పండ్లు పంపిణీ చేసినట్లు సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్నంగి సుబ్బారావు, తమ్మన శ్రీనివాసరావు, లేవి ప్రసాద్, జవ్వాది శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.